2016, డిసెంబరు 31వ తేదీన ప్రజలంతా నూతన సంవత్సర వేడుకల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఇంతలో అనుకోని ప్రమాదం. నెల్లూరు శివార్లలోని పెన్నాతీరాన పొర్లుకట్ట ప్రాంతంలో తీవ్ర విషాదం. బాణసంచా తయారు చేస్తున్న ప్రాంతంలో ఒక్కసారిగా పేలుళ్లు. దట్టమైన పొగ అలుముకుంది. ఏం జరిగిందో తెలుసుకు నేలోపు సుమారు పది మంది వరకు మృత్యువాత పడ్డారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రిపాలయ్యారు. ఇక్కడ బాణసంచా తయారీకి అనుమతి లేదని అధికారుల విచారణలో తేలింది. ఈ ఘటన ఇప్పటికీ నెల్లూరువాసుల మదిలో మెలుగుతూనే ఉంది.

ఈ ఏడాది సెప్టెంబరు 4వ తేదీ అర్ధరాత్రి నెల్లూరు శివార్లలోని కల్లూరుపల్లి వద్ద ఓ టపాసుల గోదాములో బాణసంచా పేలుడు సంభవించింది. వరండాలో నిద్రిస్తున్న వాచ్‌మన్ సజీవ దహనం కాగా, మరొకరు ప్రాణాలతో బయటపడ్డాడు.

మచ్చుకు ఈ రెండు ఘటనలే. కానీ జిల్లాలో అడపాదడపా ఎక్కడో ఒకచోట పేలుళ్లు సంభవిస్తూనే ఉన్నాయి. దీపావళి పండుగ సీజన్ ఆరంభం నుంచే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత షరామామూలై పోయింది. అనుమతులు తీసుకోకుండా టపాసుల తయారీ చేస్తుండటం, కనీస ప్రమాణాలు పాటించకపోవడంతోనే ఇలాంటి ఘాతుకాలు జరుగుతున్నాయి.

పొర్లుకట్ట వద్ద బాణసంచా తయారుచేస్తున్న కూలీలు







నెల్లూరు శివార్లలోని కల్లూరుపల్లి వద్ద బాణసంచా పేలుడు జరిగిన గోదాము ఇదే!

ఆనందం నింపేనా..

అగ్గి రాజేసేనా!?

దీపావళి వస్తోందంటే అందరికీ భలే సంబరం. పండుగ రోజున చిన్నా పెద్ద అని తేడా లేకుండా ప్రతిఒక్కరూ బాణాసంచా కాల్చి ఆనందంగా గడుపుతారు. ఇంతవరకు బాగానే ఉన్నా బాణాసంచా తీయారీ, గోదాముల్లో నిబంధనలు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 31వ తేదీన దీపావళి పండుగ కాగా, నెల మొదటి వారం నుంచే టపాసుల తయారీ జిల్లావ్యాప్తంగా జోరందుకుంది. చుచ్చిబుడ్డీలు, నెల్లూరు గస్‌లు, తాటాకు టపాసులు, ఇలా అనేక రకాల టపాసులను కూలీలు క్షణం తీరిక లేకుండా రాత్రింబవళ్లు పనిచేస్తూ తయారు చేస్తున్నారు. మరి తయారీ కేంద్రాలు, విక్రయ కేంద్రాలు, గోదాములు అనుమతులు పొందిన ప్రాంతాల్లోనే ఉన్నాయా.. అనుమతించిన మోతాదులోనే నల్ల మందును వ్యాపారులు నిల్వ ఉంచుతున్నారా.. కూలీల భద్రత కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.. నిబంధనలు పాటిస్తున్నారా.. ఈ ప్రశ్నలన్నిటికీ అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు, కమర్షియల్ ట్యాక్స్ ఇలా ఏ శాఖ అధికారుల వద్ద కూడా సమాధానం కరువవుతోంది. అసలు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారులు నిబంధనలు గాలికి వదిలి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

● అనుమతులకు మించి నిల్వలు

అగ్నిమాపక శాఖ అధికారుల సమాచారం మేరకు నెల్లూరు నగర పరిసర ప్రాంతాల్లో 3 గోదాములు ఉన్నాయి. నగరంలోని పొర్లుకట్ట, కావలి, ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో 8 టపాసుల తయారీ కేంద్రాలు ఉన్నాయి. 16 షాపులకు రెన్యువల్ లైసెన్సులు ఉండగా పండుగకు ముందు టెంపరరీగా జిల్లావ్యాప్తంగా 400లకుపైగా దుకాణాలకు అనుమతులు ఇస్తారు. అయితే గోదాముల్లో అనుమతుల మేరకే సరుకు నిల్వ ఉంచాలి. గోదాములు, దుకాణాల్లో 10 కేజీల నుంచి 1500 కేజీల వరకు నిల్వ కోసం అధికారులు అనుమతులు ఇస్తారు. అయితే, వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తూ వేల కిలోల సరుకును నిల్వ ఉంచి అమ్మకాలు జరుపుతున్నారు. అధికారిక లెక్కల జిల్లాలో 8 తయారీ కేంద్రాలని చెబుతున్నా వాస్తవ రూపేణా పందుల సంఖ్యలోనే తయారీ కేంద్రాలు ఉన్నాయి. గుట్టుచప్పుడు కాకుండా రాత్రింబవళ్లు బాణాసంచా తయారు చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా ఇష్టానుసారంగా బాణసంచా తయారీ కేంద్రాలు

నిర్దేశిత స్టాక్‌కు మించి నిల్వలు, విక్రయాలు

నిబంధనలు పాటించని లైసెన్స్‌దారులు

గత అనుభవాల పాఠం నేర్వని అధికార యంత్రాంగం

శాఖల మధ్య సమన్వయ లోపమే కారణమా!?

గాలిలో టపాసుల తయారీ కూలీల బతుకులు

ఇప్పటికైనా మేల్కొనకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదు!

● అధికారుల తనిఖీలు శూన్యం

ఈ నెల మొదటి వారం నుంచే టపాసుల తయారీ కేంద్రాల్లో పనులు ప్రారంభమయ్యాయి. గోదాములు, దుకాణాల్లో టపాసుల అమ్మకాలు పది రోజుల ముందు నుంచే జోరందుకున్నాయి. అయితే, పలు శాఖల అధికారులు మాత్రం ఇప్పటివరకు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. వాస్తవంగా అగ్నిమాపక, రెవెన్యూ పోలీసు, కమర్షియల్‌ట్యాక్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి వ్యాపారులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి. అలాగే ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. కానీ క్షేత్రస్థాయిలో అవేమీ జరగడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

వలేటివారిపాలెంలోని ఓ ఆర్ఎంపీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



కందుకూరులో డెంగ్యూ!

● నెల రోజుల్లో పదిమంది మృతి

జ్వరం అంటేనే కందుకూరువాసులు వణికిపోతున్నారు. రోజుల తరబడి జ్వరం తగ్గకపోవడంతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. తీరా అక్కడ జరిపిన నిర్ధారణ పరీక్షల్లో డెంగ్యూగా బయటపడుతోంది. నెలరోజుల వ్యవధిలో డెంగ్యూబారిన పడి పది మంది వరకు మృతి చెందినట్లు అంచనా. పారిశుధ్యం వ్యవస్థ అధ్వానంగా ఉండటంతోపాటు దోమల బెడద ఎక్కువగా ఉండటంతో జ్వరాలు వ్యాపిస్తున్నాయని నియోజకవర్గ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వలేటివారి పాలెంలోనూ చికిన్‌గున్యా, టైఫాయిడ్, డెంగ్యూ, సాధారణ జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. 6



నేటి నుంచి పశుగణన

దాదాపు ఐదేళ్ల తర్వాత జిల్లాలో పశుగణన జరగనుంది. మూగజీవాల లెక్కలు తల్చేందుకు ఇంటింటికి వెళ్లి సర్వేచేసేలా కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ వివరాల ఆధారంగా పశువుల బాగోగులకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై చర్యలు తీసుకోనుంది. ఈ నేపథ్యంలో అఖిల భారత పశుగణన గోడపత్రికలను కలెక్టర్ ఆనంద్ గురువారం ఆవిష్కరించారు. 6



డ్యాం ముందు పూర్తికాని డైవర్షన్ వాల్ నిర్మాణం



ఇంకెంత కాలం!?

● 'సోమశిల'లో అభివృద్ధి పనుల సా..గదీత

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు సాగదీత ధోరణిలో జరుగుతున్నాయి. ఓ వైపు డ్యాంకు వరద ప్రవాహం కొనసాగుతుండగా మరోవైపు అడపాదడపా కురుస్తున్న వర్షాలతో నీటి నిల్వ 61 టీఎంసీలు దాటింది. ఇక 15 టీఎంసీలు చేరితే ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీరు దిగువకు వదలాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ తరుణంలో డ్యాం ముందు జరుగుతున్న అప్రాన్ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. డైవర్షన్ వాల్ నిర్మాణం 50 శాతం కూడా పూర్తికాలేదు. రానున్న రోజుల్లో కురిసే వర్షాలతో పనులకు ఆటంకం కలిగే పరిస్థితి ఉంది. ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ అభివృద్ధి పనులు త్వరితగతిన చేసేలా ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం అన్ని వర్గాల్లోనూ ఏర్పడుతోంది. కాగా, సోమశిలకు గురువారం ఉదయం 16,769 క్యూసెక్కుల వరద వస్తుండగా సాయంత్రానికి 20,207 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

డీఆర్వోగా ఉదయ భాస్కర్ రావు



నెల్లూరు (హర నాథపురం), అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా జే ఉదయ్ భాస్కర్ రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీఆర్వోగా పనిచేస్తున్న లవన్నను జీఏడీలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొనారు. ఉదయభాస్కర్ రావు పశ్చిమ గోదావరి జిల్లా డీఆర్వోగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు.

నెల్లూరులో అందరూ చూస్తుండగానే
ఆటో మెకానిక్ దారుణ హత్య
7 లో



పాఠశాలల నిర్వహణకు
రూ.2.87 కోట్లు మంజూరు

విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయింపు

కేజీబీవీల్లోనూ అభివృద్ధి పనులు

38 ఎంఆర్‌సీలకు రూ.49.40 లక్షలు

ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి

6 లో

డీఈవోగా బాలాజీరావు

● కృష్ణా జిల్లాకు రామారావు బదిలీ

నెల్లూరు (విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుజిల్లా నూతన విద్యాశాఖాధికారిగా డాక్టర్ రాజా బాలాజీరావు నియమితులయ్యారు. ప్రస్తుత డీఈవో పీవీజే.రామారావును కృష్ణా జిల్లాకు బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో డీఈఓగా బాధ్యతలు చేపట్టిన రామారావు పదినెలలపాటు సేవలందించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రామారావును కృష్ణాకు, డాక్టర్ రాజా బాలాజీరావును నెల్లూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రకాశం జిల్లా కొండేపి మండలం నెన్నూరుపాడు గ్రామానికి చెందిన బాలాజీరావు పల్లిపాడు డైట్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతుల్లో భాగంగా నెల్లూరు రెగ్యులర్ డీఈఓగా నియమితులైన ఆయన మరో రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా బాలాజీరావు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పల్లిపాడు డైట్‌లో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న తనకు డీఈవోగా పదోన్నతి లభించిందని పేర్కొన్నారు. జిల్లాలో అత్యధికకాలం పనిచేసిన అనుభవం ఉండటంతో అందరితో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. అందరి సహకారంతో జిల్లాలో పాఠశాల విద్యను బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు.



నూతన డీఈవో బాలాజీరావు

కలెక్టర్ వారి కార్యాలయము, నెల్లూరు.

ఆర్సీహెచ్.1.704/24 తేదీ: 24-10-2024

షార్టు టెండరు నోటీసు

విషయము: ఫోటో ఓటర్లు జాబితా సంక్షిప్త సవరణ-2025-శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా- ఫోటో ఓటర్ల జాబితాలు డిజిటల్ కాపీయింగ్ చేయుటకు మరియు ఫామ్-6,7,8,12,13,14,15 ముద్రించుటకు షార్ట్ టెండర్ నోటీసు పిలుచుట - గురించి.

&&&

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఫోటో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2025కు గాను ఫోటో ఓటర్ల జాబితాల డిజిటల్ కాపియింగ్ మరియు ఫారం-6,7,8,12,13,14,15 ముద్రించుటకు నిమిత్తం షార్టు టెండర్ నోటీసు ఇందుమూలముగా పిలవడమైనది.

విభాగము-:1

1.డిజిటల్ ఫోటో కాపీయింగ్ చేయవలసిన ఫోటో ఓటర్ల జాబితా - 8,00,000
2.పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాలు పిన్నింగ్ బండిల్ (Bundle) చేయవలెను.
3.డిజిటల్ ఫోటో కాపీయింగ్ పేపర్‌కు రెండు వైపులా చేయాలి
4.డిజిటల్ కాపీయింగ్ పని రెండు రోజులలో పూర్తి చేయాలి.

విభాగము-:2

ఫారం-6	ఫారం-7	ఫారం-8	ఫారం-12	ఫారం-13	ఫారం-14	ఫారం-15
40000	35000	35000	40000	50000	50000	31000

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఆసక్తిగల వారు తేది.02-11-2024, సాయంత్రం 3.00 గంటలలోపు శ్రీయుత కలెక్టరు వారి కార్యాలయము, నెల్లూరుజిల్లా రెవెన్యూ అధికారి వారి చాంబర్‌లో ఉన్న టెండర్ పెట్టె నందు సీల్డ్ టెండర్లు సమర్పించవలసినదిగా తెలియజేయడమైనది.

సీల్డ్ టెండర్లు తేది.04-11-2024 సాయంత్రం 3.00 గంటలకు కొనుగోలు కమిటీ చేత కలెక్టర్ వారి కార్యాలయము నందు పరిశీలించబడును.

కలెక్టరు మరియు జిల్లా ఎన్నికల అధికారి తరపున
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, నెల్లూరు.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని క్వార్ట్జ్, సిలికా క్వారీలను నడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖనిజాలను ఇష్టానుసారంగా దోపిడీ చేయడంతో కూటమి ప్రభుత్వం అన్నీ క్వారీల్లో తవ్వకాలను నిలుపుదల చేసింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్వారీల యజమానులు అనుమతుల కోసం ప్రభుత్వానికి పలుమార్లు విన్న వించుకోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. కఠిన నిబంధనలతో అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు.

క్వార్ట్జ్, సిలికాకు పచ్చజెండా

కఠిన నిబంధనలతో క్వారీలకు అనుమతులు

జిల్లాలో తెరుచుకోనున్న దాదాపు 150 క్వారీలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గూడురు, చిల్లకూరు ప్రాంతాల్లో దాదాపు 80 సిలికా క్వారీ లీజులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 180 క్వార్ట్ లీజులు ఉన్నాయి. వైసీపీ హయాంలో ఇష్టానుసారంగా తవ్వకాలు జరిపినందుకు పలు క్వారీల యజమానులకు రూ.కోట్లలో పెనాల్టీ వేశారు. కొందరిపై కేసులూ నమోదు చేశారు. ఇలాంటి క్వారీలకు ప్రస్తుతం కూడా అనుమతులు ఇచ్చేది లేదని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 30 క్వారీలపై పలు కేసులు, పెనాల్టీలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని మినహాయిస్తే క్వార్ట్ 150, సిలికా 80 క్వారీలకు కొన్ని రోజుల్లో అనుమతులు ఇవ్వనున్నారు.

● పరిశీలనకు నాలుగు బృందాలు

ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న సిలికా, క్వార్ట్ క్వారీల పరిశీలనకు ప్రభుత్వం నాలుగు బృందాలను నియమించింది. ఇతర జిల్లాల అధికారులతో కూడిన ఈ బృందాలు రెండు రోజుల్లో జిల్లాలో పర్యటించనున్నాయి. సిలికా క్యారీల రెండు బృందాలు, క్వార్ట్ క్వారీలను మరో రెండు బృందాలు

- మిగతా 6లో



మైనింగ్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులు

ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్

రెవెన్యూ, పోలీసుల దాడులు

వాహనాల సీజ్, 12 మందిపై కేసు

తెర వెనుక రాజకీయ నేతల మద్దతు

సైదాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామసాగరం గ్రామ ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై గురువారం రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా తెల్లరాయి వెలికి తీసేందుకు సిద్ధంగా ఉన్న హిటాచీ మిషన్, జేసీబీ,

- మిగతా 6లో



ప్రతిష్ఠకు పెన్నా జలాలు

నెల్లూరులోని పప్పులవీధిలో నూతనంగా నిర్మించిన సౌభాగ్య సరస్వతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు గురువారం ఉదయం తీర్థ సంగ్రహణం వైభవంగా జరిగింది. 600 మందికిపైగా మహిళా భక్తులు తల్పగిరి రంగనాథస్వామి ఆలయ ఘాట్ నుంచి కలిశాల్లో పెన్నాజలాలు నింపుకుని మేళతాళాలతో ఊరేగింపుగా సౌభాగ్య సరస్వతి ఆలయానికి చేరుకున్నారు. కలిశాల్లోని పెన్నా జలాలతో నూతన విగ్రహాలకు అభిషేకాలు చేశారు. కాగా, ప్రతిష్ఠ ఉత్సవాలకు గురువారం రాత్రి అంకురార్పణ జరిగింది. స్వామి అనుజ్ఞ, మహాసంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షాబంధనం, మృత్తికా పూజ, అఖండ దీపస్థాపన, జల, క్షీరాధివాసాలు జరిగాయి. అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, తిరుపతి శక్తి పీఠాధిపతి రమ్యానంద భారతీ అనుగ్రహ సంభాషణం జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ప్రధాన అర్చకులు మాచవోలు రమేష్‌శర్మ, మేనేజర్ మాచవోలు అనురాధ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- నెల్లూరు సాంస్కృతికం,(ఆంధ్రజ్యోతి)

నీరు ఇలా.. వెళ్లేదెలా!?



చాగొల్లు రైల్వే గేటు వద్ద నిర్మించిన అండర్ పాస్ బ్రిడ్జి ఇటీవల కురిసిన వర్షాలతో నిండిపోయింది. సుమారు బ్రిడ్జి నిండా 5 అడుగుల మేర నీరు నిలిచింది. ఈ సమస్యతో రైతులు గేటు ఆవతల ఉన్న పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దుక్కిదున్ని వరి నార్లు పోసుకునే సమయంలో ట్రాక్టర్లు వెళ్లాలంటే నీటిలో మునిగిపోతాయని ఆందోళన చెందుతున్నారు. బ్రిడ్జి నిర్మించారు కానీ వర్షపు నీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లే వెసులుబాటు కల్పించలేదని రైతులు రైల్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి)

నీళ్లతో నిండిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి

మత్స్యకారుల వెలుగు జువ్వలదిన్నె

- హార్బర్ నిర్మాణంతో బహుళ ప్రయోజనాలు
- మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు
- స్థానికులకు ఉపాధి, ఆర్థిక పురోభివృద్ధి

కావలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల చిరకాల వాంఛ బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి రానుంది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పురుడు పోసుకున్న ఈ పనులు మరలా కూటమి ప్రభుత్వంలోనే ప్రారంభం అయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.288 కోట్లను మంజూరు చేశాయి. నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు కేంద్రం ఇవ్వగా రాష్ట్ర ప్రభుత్వం 70ఎకరాల భూమిని సేకరించి నిర్మాణానికి అప్పగించింది. 2019, జనవరిలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఐదేళ్లకు నిర్మాణం దాదాపు పూర్తి చేసుకోవటంతో ఆగస్టు 30న ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఈ హార్బర్‌ను ప్రారంభించారు.

● ప్రయోజనాలు ఇలా..

జువ్వలదిన్నెలో హార్బర్‌తో మత్స్యసంపదను నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగులు, పడవలకు అవసరమైన డీజిల్ సరఫరాకు పెట్రోల్ బంకు ఏర్పాటు, చేపలు ఆరబోసుకునేందుకు ప్లాట్‌ఫారాలు, వాటిని నిల్వ చేసుకునేందుకు గోదాములు, మత్స్యకారులు విశ్రాంతి గదులను నిర్మించారు. అంతేగాక మత్స్య సంపదను విక్రయించేందుకు వీలుగా హార్బర్ జెట్టీ వద్దకు వేట పడవలను తీసుకొని రావచ్చు. వేట సాగించి అలసిన మత్స్యకారులు అక్కడే విశ్రాంతి తీసుకోవచ్చు. అంతేకాదు.. ఈ ప్రాంత మత్స్యకారులు ఇతర రాష్ట్రాల పడవలకు డ్రైవర్లుగా కూడా వెళ్లవచ్చు. హార్బర్ వద్ద కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు చూసుకుని వెళ్లవచ్చు. మత్స్యసంపద అంతా ఒకే ప్రాంతంలో ఉండటంతో వ్యాపారులు అధికసంఖ్యలో కొనుగోలు చేసే అవకాశం ఉంది. పోటీతత్వంతో మత్స్యసంపదకు గిట్టుబాటు ధర లభిస్తుంది. ధర లేకుంటే శీతల గిడ్డంగులలో నిల్వ చేసుకోవచ్చు. ఇలా ప్రత్యక్షంగా.. పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. బోట్ల కొనుగోలుకు బ్యాంకు రుణాలతోపాటు రాయితీ అవకాశాలు కూడా ఉన్నాయి.



జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రాంతం (ఫైల్)



జెట్టీ వద్ద వలలు అల్లుకుంటున్న స్థానిక మత్స్యకారులు

మత్స్యకారులకు ఓ వరం



జువ్వలన్నె హార్బర్ నిర్మాణం జిల్లా మత్స్య కారులకు ఓ వరం. పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే మత్స్యకారుల పడవలు నిలుపుకో వటమేగాక అదనపు అవకాశాలు లభిస్తాయి. మత్స్యసంపదను తెచ్చుకుని గిట్టుబాటు ధరలు వచ్చే వరకు నిల్వ చేసుకోవచ్చు. రాయితీపై పడవలు, వలలు, ఇంజన్లు అందించే అవకాశంతో అభివృద్ధి చెందుతారు.

- కొండూరు పోలిశెట్టి, ఆఫ్కాబ్ మాజీ చైర్మన్, ఇస్కపల్లి

ఉపాధితో వలసలు నివారణ



ప్రస్తుతం గంగపుత్రులు జీవనోపాధికి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లుతున్నారు. హార్బర్ నిర్మాణంతో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి వలసలు నివారించవచ్చు. మత్స్యసంపదకు గిట్టుబాటు ధరలు లభిస్తే మత్స్యకారుల జీవనవిధానంలో వెలుగులు రానున్నాయి.

- వాయిల చిట్టిబాబు, తాటిచెట్లపాలెం



జెట్టీ వద్ద స్థానిక పడవలు



జెట్టీ వద్ద ఆగి ఉన్న ఇతర ప్రాంతాల బోట్లు

● 21 నుంచి వినియోగంలోకి..

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో జెట్టీని 1250 బోట్లు ఆగేలా నిర్మించారు. ప్రస్తుతం అక్కడ బోట్లు తాత్కా లికంగా ఆగు తున్నా.. తుది నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. మత్స్యకారుల దినోత్సవం నవంబరు 21నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలనే ఆలోచనలో అధికారులు, పాలకులు ఉన్నారు. పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే మత్స్యకారుల మత్స్యసంపదకు గిట్టుబాటు ధర లభ్యమై ఆర్థిక పురోభివృద్ధి చెందుతారు. ఈ హార్బర్‌లోనే మత్స్యసం పద వ్యాపారానికి వసతులు సమకూర్చుతుండటంతో వారి జీవన విధానంలో మార్పులొస్తాయి.

కష్టాలు తీరిపోతాయి



సముద్రంలో వేటకు వెళ్లి పడవలను ఒడ్డుకు చేర్చుకోవాలన్నా.. మత్స్యసంపదను తీసుకరావాలన్నా మత్స్యకారులు యజ్ఞం చేయాల్సి ఉండేది. హార్బర్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే మత్స్యకారుల కష్టాలు తొలగి గిట్టుబాటు ధర లభిస్తోంది. వేటలో మత్స్య సంపద తక్కువగా వస్తే అమ్ముకునేందుకు ఇబ్బందులు ఉండేవి. హార్బర్‌తో ఎంత మత్స్యసంపద వచ్చినా అక్కడే అమ్ముకునే వెసులుబాటు ఉంది.

- వాయిల శ్రీనుబాబు, తుమ్మలపెంట



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన పశుసంవర్ధక శాఖ అధికారులు

నేటి నుంచి పశుగణన

- 15 అంశాలపై సర్వే
- అధికారులకు పూర్తయిన శిక్షణ

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి పశుగణన ప్రా రంభం కానుంది. 2019లో సర్వే జరగ్గా ఐదేళ్ల తర్వాత ఇప్పుడు జరగనుంది. ఇప్పటికే జిల్లాలో 70 మంది సూపర్వైజర్లు శిక్షణ పొందారు. ఒక్కొక్కరు గ్రా మాల్లో రెండు వేల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో 3వేల ఇళ్లు సర్వే చేయాలనేది లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఒక్కో సూపర్వైజర్ ఐదుగురు ఎన్యూమరేట ర్లను పర్యవేక్షిస్తారు. పాలు, కోడిగుడ్లు, మాంసం, వంటి దిగుబడి ఇలా 15 అంశాలపై సమాచారం సేకరిస్తారు. సచివాలయాల్లోని పశుసంవర్ధక శాఖ సహాయకులు, పశువైద్యులు, గోపాలమిత్రలు కూడా సర్వే అధికారులతో ఉంటారు.

● సమగ్ర సమాచారం అందించాలి

పశువుల సమగ్ర సమాచారం అందించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ రూపొందించిన గోడపత్రికలను గురువారం ఆయన తన చాంబర్‌లో ఆవిష్కరించి, మాట్లాడారు. పశుగణన కు సంబంధించి దేశం మొత్తం ప్రతి ఐదేళ్లకు ఒకసారి సర్వే జరుగుతుందని చెప్పారు. పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్ మాట్లాడుతూ పశుగణనతో పథకాల రూపకల్పన జరుగుతుందని, అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు సోమయ్య, నాగమణి, రామచంద్రారెడ్డి, మంజునాథ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే పరిహారం

- టీజీపీ రాపూరు ఎస్‌డీసీ ప్రేమ్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భూసేకరణ చట్టం-2013, రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మాత్రమే కండలేరు ముంపు ప్రాంతమైన గుండవోలు గ్రామంలోని సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములకు పరిహారం చెల్లిస్తామని టీజీపీ రాపూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రేమ్‌కుమార్ ఓ ప్రక టనలో తెలిపారు. 'ఇదేం వింత సామీ' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో మంగళ వారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. 99.56 ఎకరాలకు కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చామని, అందులో 78.14 ఎకరాలు నూతనంగా ముంపునకు గురవుతున్నట్లు టీజీపీ ఎస్తఈ రిక్విజిషన్ ఇచ్చినట్లు వెల్లడిం చారు. మరో 29.50 ఎకరాలకు గతంలోనే రిక్విజిషన్ ఇచ్చినప్పటికీ పరి హారం మాత్రం ఇవ్వలేదని రికార్డుల ఆధారం తెలుస్తోందని వివరించారు. ఇందుకు సంబంధించి రైతులు పరిహారం కోసం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారని, పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినట్లు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించి ప్రాథమిక ప్రకటనను పారదర్శకంగా జారీ చేశామని, ఎవరికైనా వీటిపై అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లో తెలియజేయవచ్చునని సూచిం చారు. ఎటువంటి అభ్యంతరాలు లేని భూములకు మాత్రమే చివరగా అవార్డు చేసి పరిహారం చెల్లిస్తామని ఎస్‌డీసీ స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్

(5వ పేజీ తరువాయి)

రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. అక్కడ పని చేస్తున్న 12మందిపై పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్ఐ కాంతి కుమార్ మాట్లాడుతూ వాహనాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న అమర్‌నాథ్‌రెడ్డితో పాటు మరో 11 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వైసీపీకి చెందిన అమర్‌నాథ్‌రెడ్డి వెనుక నెల్లూరుకు చెందిన గతంలో వైసీపీలో ఉండి ప్రస్తుతం టీడీపీలో ఉన్న ఓ నేత మద్దతుతోనే ఈ మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

పచ్చజెండా

(5వ పేజీ తరువాయి)

పరిశీలించేట్లు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న క్వారీల్లో ప్రస్తుతం ఎంత స్టాక్ ఉంది? అనేది పరిశీలించనున్నారు. అలాగే, ప్రతీ క్వారీ దగ్గర తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం, ఖనిజాలు తరలించే వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ ఏర్పాటు వంటి నిబంధనలను ఈ బృందాలు అమలు చేయించనున్నాయి. చిన్న...చిన్న అపరాధ రుసుములు చెల్లించాల్సి క్వారీలతో వాటిని కట్టించి అనుమతులు ఇచ్చేలా కూడా ఈ బృందాలు పనిచేయనున్నాయి. అన్నీ క్వారీల పరిశీలన పూర్తయిన తరువాత నివేదికను రాష్ట్ర ఉన్నతా ధికారులకు అందజేస్తారు. ఆ తరువాత క్వారీలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయనుంది. కాగా, కొన్ని నెలలుగా మూతపడిన క్వారీలు తిరిగి తెరుచుకోనుండటంతో క్వారీల యజమానుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

కందుకూరును వణికిస్తున్న డెంగ్యూ

- పెరుగుతున్న బాధితులు, మృతుల సంఖ్య
- కానరాని నియంత్రణ చర్యలు
- గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం



కందుకూరులో చేతిపంపు వద్ద మురుగు

కందుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ వణికిస్తోంది. జ్వరం అంటేనే ప్రజలు హడలిపోతు న్నారు. కందుకూరు నియోజకవర్గంలో నెలరోజుల వ్యవధిలో పది మందికిపైగా డెంగ్యూ లక్ష ణాలతో మృత్యువాత పడ్డారు. సాధారణ జ్వరంగా మొదలై నాలుగైదు రోజుల్లో డెంగ్యూ లక్షణాలు బయటపడుతున్నాయి. ఇటీవల కందుకూరు మండలం కంచరగుంట గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఇంటూరి వెంకటేశ్వర్లు, పందలపాడు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, కందుకూరు లోని దర్గాసెంటర్‌లో ఐదేళ్ల చిన్నారి డెంగ్యూ జ్వరంతో మృతి చెందారు. 15 రోజుల వ్యవధిలో పట్టణంలోని పలుప్రాంతాలలో మరో ముగ్గురు డెంగ్యూ లక్షణాలతోనే మృతి చెందారు. డెంగ్యూ లక్షణాలు ప్రారంభమయ్యాక శరీరంలోని అవయవాలు ఒక్కొక్కటి దెబ్బతింటూ మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు దారితీస్తున్నాయని దీంతో ఎంతప్రయ త్నించినా ప్రాణాలు కాపాడలేకపోతున్నట్లు డాక్టర్లు చెబుతున్నా రు. డెంగ్యూకు కారణమయ్యే దోమల్లోనే మల్టీ ఆర్గాన్ ఫెయి ల్యూర్‌కు దారితీసే వైరస్ ఉంటున్నట్లు వివరిస్తు న్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యపరీక్షలు, మందుల పేరుతో కనీసం ఆరేడు వేల రూపాయ లకు తక్కువ కాకుండా బిల్లులు వేస్తున్నారని సామాన్య ప్రజా నీకం వాపోతోంది. దీంతో ఆర్ఎం పీలు, పీఎంపీలపైనే ఆధారపడు తుండటం కూడా తీవ్రతను పెంచుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● నివారణ చర్యలు శూన్యం

జ్వరపీడితులు విపరీతంగా ఉండటమేగాక డెంగ్యూ లక్షణాలతో మరణాలు సంభవిస్తున్నా నివారణ చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయి. పారిశుధ్యం మెరుగు, దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదు. డెంగ్యూకు కారణమయ్యే దోమల లార్వా నిర్మూల నకు కనీసచర్యలు చేపట్టడం లేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామ పంచాయతీలకు ఇటీవల ఆర్థిక సంఘం నిధులు విడుదలైనా ప్రజా ప్రతినిధులు పారి శుధ్యం గురించి పట్టించు కుంటున్న దాఖలాలు లేవు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పారి శుధ్య పరిస్థితులు మెరుగుపరచటం, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెంద కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిం చటం వంటి కార్యక్రమాలు కూడా చేపట్టడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నియోజకవర్గంలో పారిశుధ్య మెరు గునకు చర్యలు చేపట్టడంతో పాటు దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వణికిపోతున్న వలేటివారిపాళెం!



వలేటి వారిపాలెం (ఆంధ్రజ్యోతి) : కాకర్లవారిపాలెం, చిన్నఅమ్మపాలెం చుండి గ్రామాలలో చికెన్‌గున్యా, టైఫాయిడ్, డెంగ్యూ, సాధారణ జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అమ్మపాలెం, కాకర్లవారిపాలెం గ్రామాల్లో ఏ ఇంటిలో చూపినా ఒకరిద్దరు జ్వరపీడితులు మంచం పట్టారు. వలేటివారిపాలెంలో ఉన్న ఆర్ఎంపీ ఆసుపత్రులు జ్వరపీడుతులతో కిటకిటలాడుతున్నాయి. తీవ్ర జ్వరంతోపాటు కీళ్లనొప్పులు, ఒంటి నొప్పులు, దద్దుర్లతో జనం అల్లాడిపోతున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా చిన్నా పెద్దా తేడా లేకుడా వైరల్, చికెన్ గున్యా జ్వరాలు చుట్టుముట్టాయి. ఇంట్లో ఒకరికి జ్వరం సోకితే ఇంటిల్లపాదికి వ్యాపిస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కాకర్లవారిపాలెం, అమ్మపాలెం గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కాలువల్లో మోకాలి లోతున పచ్చిగడ్డి పెరిగి మురుగు నీరు ముందుకు కదలడంలేదు. అంతేగాక ఇళ్ల ముందున్న కుంటలు దోమలకు ఆవాసాలుగా మారిపోయాయి. కాకర్లవారిపాలెంలో వైద్యాధికారులు తూతూమాత్రంగా వైద్యశిబిరం నిర్వహించి చేతులు దులుపేసుకుంటున్నారు. కనీసం నిర్ధారణ పరీక్షలు కూడా చేయడం లేదు. అలాగే, ప్రజలకు అవగాహన కల్పించిన దాఖలాలూ లేవు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి అమ్మపాలెం, కాకర్లవారిపాలెం, చుండి గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహించి, జ్వరాలను అదుపులోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల నిర్వహణకు రూ.2.87 కోట్ల మంజూరు

- కేజీబీవీల్లోనూ అభివృద్ధి పనులు
- ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి

నెల్లూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పాఠశాలల నిర్వహ ణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని సమగ్ర శిక్షాభియాన్ అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్.ఉషారాణి తెలిపారు. గురువారం ఎస్ఎస్ఏ కార్యాలయంలో ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. జిల్లాలోని 2,498 పాఠ శాలలకు రూ.2,87,35,000 విడుదలై నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలకు నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. అలాగే 38 ఎంఆర్‌సీలకు ఒక్కో దానికి రూ.1.30 లక్షల చొప్పున మొత్తం 49.40 లక్షలు విడు దలై నట్లు తెలిపారు. 'ఈ నిధులను ఎమ్మార్సీ నిల్వ ఖాతాకు రూ.30 వేలు, కంటిం జెన్సీ కింద రూ.40 వేలు, టీఎల్ఎం గ్రాంట్ కు రూ.30వేలు, మీటింగ్ టీఏకు రూ.30వేలు కేటాయించారు. కేటాయించిన వాటిని కరెంట్ బిల్లుల చెల్లిం పులు, ఎమ్మార్సీల నిర్వహణ, మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్వహణకు వినియోగించాలి. అలాగే టీఎల్ఎం గ్రాంట్‌ను పుస్తకాలు కొనుగోలుకు, మం డల స్థాయిల్లో కార్యక్రమాలు, పోటీల నిర్వహణకు ఉపయోగించాలి. కంటెంజెన్సీ గ్రాంట్‌ను ఇంటర్నెట్ చార్జీల చెల్లింపులు, అవసరమైన సామగ్రి కొనుగోలుకు, మైనర్ రిపేర్లకు విని యోగించాలి. అలాగే సీతారామ పురం, లింగసముద్రం, కావలి, కలిగిరి, వివిపాళెం, ఏఎస్‌పేట, ఉలవపాడు, మర్రిపాడు, గుడ్లూరులలోని కేజీబీవీల్లో నూతన కంప్యూటర్ గదులు నిర్మాణానికి ఒక్కొక్క దానికి రూ.18.50లక్షలు కేటాయించారు. వీటితోపాటు వీవీపాళెం, గుడ్లూరు, కావలి, మర్రిపాడు కేజీబీవీల్లో లైబ్రరీ గదుల నిర్మాణానికి ఒక్కొక్కదానికి రూ.23.10 లక్షలు, వీవీపాళెం కేజీబీవీకి సైన్స్‌ల్యాబ్ నిర్మాణానికి రూ.18.50 లక్షలను కేటాయించారు. ఈ నిధులతో పనులన్నీ వేగవంతం చేసి నిర్మాణాలను త్వరగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం' అని ఆమె అన్నారు.

కలిగిరి శివారులో ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్





పోలంపాడువద్ద ఆగిన రోడ్డు నిర్మాణం



చెరువుకట్ట మలుపు వద్ద నామమాత్రంగా సూచికలు



రహదారిలో ఓవైపు ముళ్ళకంప, మరోవైపు గుంతలు

అసంపూర్తి పనులు.. అవస్థల ప్రయాణం

కావలి నుంచి దుత్తలూరు వరకు చేపట్టిన జాతీయ రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు ప్రయాణించాలంటే అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో కలిగిరి శివారు టోల్‌గేట్ ప్రాంతం, పోలంపాడు చెరువుకట్ట మలుపుల వద్ద, చినక్రాక బ్రిడ్జి, జలదంకి బైపాస్ కూడలి వద్ద పనులు ఇంకా పూర్తి కాలేదు. అసంపూర్తిగా ఉన్న పనుల వద్ద గాలికి పడిపోయే సూచికలు ఏర్పాటు చేశారు. రోడ్డుపై కంకర గుట్టలు, ముళ్లకంపలు అడ్డదిడ్డంగా వేయడం, రహదారి గుంతలమయంగా ఉండటంతో ఈ మార్గంలో ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురై ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆర్నెళ్లలో 30కిపైగా ప్రమాదాలు జరిగాయంటే ఈ రహదారిలో ప్రయాణం ఎంత ప్రమాదకరంగా ఉందో తెలుస్తోంది. యుద్ధ ప్రాతిపదికన రహదారి నిర్మాణం పూర్తిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)

బస్‌షెల్టర్ నిండా బాక్సులే..

నెల్లూరు నడి మధ్యన ఉన్న కూరగాయల మార్కెట్ ముందు మెయిన్ రోడ్డుపై ఉన్న బస్‌షెల్టర్ ఆక్రమణకు గురైంది. కొందరు వ్యాపారులు ఈ షెల్టర్‌ను టమోటా ట్రేలతో నింపేశారు. దీనివల్ల వందల మంది ప్రయాణికులు నడిరోడ్డుపై ఎర్రటి ఎండలో బస్సులు, ఆటోల కోసం నిలబడాల్సి వస్తోంది.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)



మద్రాసు బస్టాండ్ వద్ద బస్‌షెల్టర్‌లో టమోటా బాక్సులు

పరిశ్రమలకు వేగంగా భూసేకరణ చేయండి

- అనుమతులు సత్వరమే ఇవ్వండి
- ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ వేగంగా చేపట్టాలని ఏపీఐఐసీ అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో గురువారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వేగంగా అనుమతులు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా బంగారం, ప్రింటింగ్, రెడీమేడ్ క్లస్టర్ల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించేందుకు పీఎంఈజీపీ రుణాలను విరివిగా మంజూరు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, జీఎం మారుతీప్రసాద్, ఏపీఐఐసీ జెడ్‌ఎం శేఖర్‌రెడ్డి, డీజెడ్‌ఎం వెంకట సురేష్, నెల్లూరు ఆర్డీవో అనూష, ఎల్‌డీఎం శ్రీకాంత్, ఏపీకే రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

హైవేలకు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- కలెక్టర్‌కు వ్యవసాయ కార్మిక, రైతు సంఘం వినతి

నెల్లూరు వైద్యం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భారత్‌మాల, సాగర్‌మాల ప్రాజెక్టుల్లో భాగంగా జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నేతలు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో వారు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ భారతమాల పేరుతో జాతీయ రహదారి 67 కిలోమీటర్లు, సాగరమాల పేరులో 47 కిలోమీటర్ల రహదారిని నిర్మించాలని నిర్ణయించారన్నారు. దీనికోసం జిల్లాలో 7 మండలాల రైతుల నుంచి భూమి సేకరించారని తెలిపారు. సదరు రైతులందరికీ బహిరంగ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం చెల్లించకుండా టెండర్లు పిలవటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలే వెంగయ్య, నారాయణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కల్లుగీత కార్మికుడి మృతి



ఘటనాస్థలిలో మల్లికార్జున మృతదేహం

మనుబోలు, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారిపై యాచవరం వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో కల్లుగీత కార్మికుడు కుడుముల మల్లికార్జున (55) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, యాచవరానికి చెందిన మల్లికార్జున కల్లుగీతతోపాటు వ్యవసాయ పనులు చూసుకుంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పనుల నిమిత్తం మనుబోలుకు వచ్చేందుకు ఇంటి నుంచి మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. రోడ్డు దాటుతుండగా చెన్నై వెళుతున్న మినీలారీ ఢీకొంది. దీంతో మోటార్‌సైకిల్ బోల్తా పడి మల్లికార్జున మరణించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీన పరుచుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

10 మద్యం సీసాల స్వాధీనం

సంగం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఓ కూల్‌డ్రింక్ షాపులో మద్యం విక్రయిస్తుండడంతో ఎస్‌ఐ రాజేష్ గురువారం రాత్రి దాడిచేశారు. ఈ దాడిలో 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. శివ అనే నిందితుడ్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ఎరువుల దుకాణంపై కేసు నమోదు

మర్రిపాడు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 24: డీసీపల్లిలో అధిక ధరకు ఎరువులు విక్రయిస్తున్న ఓ దుకాణంపై లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్ ఈశ్వర్ గురువారం కేసు నమోదు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలని ఆయన సూచించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7527
వెండి కిలో ధర	రూ. 100,900
వెండి ఒక గ్రాము	రూ.103.90

బండేపల్లిలో బోలెడు అర్జీలు

మనుబోలు మండలంలో అతి చిన్న గ్రామం బండేపల్లి. గ్రామంలో గురువారం భూముల రీసర్వే సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించగా, 192మంది రైతులు అర్జీలు ఇచ్చారు. దీంతో అధికారులకు కళ్లు తిరిగాయి. సదస్సుకు ఇన్ని అర్జీలా. ? బహుశా జిల్లాలో ఎక్కడా ఇన్ని వచ్చి ఉండవేమో అన్నట్లుగా వారు నివ్వెరపోయారు.

- మనుబోలు, ఆంధ్రజ్యోతి



ఆటో మెకానిక్ దారుణ హత్య

- నెల్లూరులో అందరూ చూస్తుండగానే ఘటన



హత్యకు గురైన ముక్తియార్ (ఫైల్)

నెల్లూరు (క్రైం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అందరూ చూస్తుండగానే నెల్లూరులో గురువారం సాయంత్రం ఓ ఆటో మెకానిక్ దారుణ హత్యకు గురయ్యాడు. పనిలోకి తీసుకునే విషయమై జరిగిన సంభాషణలో మాట మాట పెరగడంతోనే ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ ముక్తియార్ (38) అలియాస్ మోటు, ముజాహిదలకు నయాబ్ రసూల్, పర్వీన్‌లు సంతానం. కుమారుడు విజయవాడలో డిప్లొమా చదువుతుండగా, కుమార్తె ఏడో తరగతి చదువుతోంది. అయ్యప్పగుడి వద్ద పఠాన్‌బాబుకు చెందిన ఆటో మెకానిక్ షెడ్‌లో ముక్తియార్ పని చేస్తున్నాడు. ఖాళీ సమయంలో ఆటో నడుపుతుండేవాడు. ఇటీవల పఠాన్‌బాబు పనిలోనుంచి తొలగించడంతో ముక్తియార్‌కు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఆటోని సైతం కుదువ పెట్టాడు. మూడు రోజులుగా పూటుగా మద్యం సేవించి మెకానిక్ షెడ్‌కు వెళ్లి తనను పనిలోకి తీసుకోవాలని పఠాన్‌బాబును ప్రాధేయపడ్డాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ముక్తియార్ షెడ్ వద్దకు వెళ్లి యజమానితో గొడవపడ్డాడు. వారి మధ్య మాట మాట పెరిగి కోపోద్రిక్తుడైన పఠాన్‌బాబు ఇనుప రాడ్డుతో తలపై మోదడంతో తల పగిలి ముక్తియార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత బాబు అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ ఆర్‌ఎస్ కిషోర్ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని హత్యకుగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. అయితే హత్యకు గల కారణాలను విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మృతుడు తల్పగిరి కాలనీకి చెందిన సురేష్ హత్య కేసులో నిందితుడని పోలీసుల విచారణలో వెల్లడైంది.

నేడు జాబ్ మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వీ వినయ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఉదయగిరి ఎంఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలుర ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఇందులో పలు కంపెనీలు పాల్గొంటాయని, ఆసక్తి ఉన్న వారు ఉదయం 10.30గంటలకల్లా హాజరు కావాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.లక్ష విరాళం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్యమంత్రి సహాయ నిధికి బుధవారం సాయంత్రం రూ. లక్ష విరాళంగా ఇచ్చింది. వెలగపూడిలోని ముఖ్య మంత్రి కార్యాలయంలో సీఎం చంద్రబాబునాయుడుకి అసోసియేషన్ వ్యవస్థాపకుడు కొల్లా నారాయణరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు ఫణీంద్ర, ఉపాధ్యక్షులు చెన్న కేశవులు, రమేష్‌బాబు, అధ్యక్షులు హరిదాసులు, లీలా మాధవ రావు, ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి బంగారురాజు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పాతంశెట్టి రమేష్ చెక్కు అందజేశారు.

నేడు ఐటీఐ కళాశాలలో ఉద్యోగమేళా

నెల్లూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో శుక్రవారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్న ట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మేళాలో ప్రముఖ సంస్థలు పాల్గొని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని తెలిపారు. ఎస్‌ఎస్‌సీ నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ, డిప్లమో చదివిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఫోన్ 9704510793, 6301529271 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కాలుష్య నియంత్రణ మండలి సభ్యురాలిగా విజయ



ప్రొఫెసర్ చలంచర్ల విజయ

వెంకటాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ చలంచర్ల విజయను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) సభ్యురాలిగా నియమిస్తూ గురువారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొఫెసర్ విజయ మెరైన్ కాలుష్యం అనే అంశంపై పలు పరిశోధనలు చేసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పరిశోధన పత్రాలను సమర్పించారు. విజయ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందారు. ఆమె ఎంపిక పట్ల వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయబాస్కర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురి డీబార్

వెంకటాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో గురువారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 7757 మంది విద్యార్థులకుగాను 7241 మంది హాజరు కాగా, 516 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, వీఆర్ ఐఏఎస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, సూళ్లూరుపేటలోని విక్రమ్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు డీబార్ అయినట్లు ఆమె తెలిపారు.

రోడ్డెక్కిన విద్యార్థులు



అనంతసాగరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం బాగోలేదని, మెనూ పాటించడం లేదంటూ సోమశిల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కూరల్లో ఉప్పు, కారం ఉండదని, ప్రశ్నిస్తే నిర్వాహకులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు విచారించి భోజన నిర్వాహకులను మార్చాలని డిమాండ్ చేశారు. ఈమేరకు పాఠశాల కమిటీ చైర్మన్ రాధకు ఫిర్యాదు చేశారు. ఎంఈవో 2 ప్రభాకర్‌రెడ్డి అక్కడకు చేరుకుని భోజన నిర్వాహకులకు మెమో ఇవ్వాలని హెచ్‌ఎం పెంచలయ్యను ఆదేశించారు.

మినగల్లు యార్డులో ఇసుక దొంగలెవరు..?

- 12 వేల టన్నుల శాండ్ మాయంపై ఉదాసీనత
- రెండు నెలలైనా తేల్చని అధికారులు
- పైగా కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించిన వైనం
- అదే కాంట్రాక్టర్‌కు మళ్లీ నామినేషన్‌పై మరో రీచ్ అప్పగింత

నెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రూపాయి కాదు.. రెండు రూపాయలు కాదు.. దాదాపు రూ.45 లక్షల విలువైన 12 వేల టన్నుల ఇసుక మిన గల్లు యార్డు నుంచి మాయమైంది. ఇసుక అక్రమంగా తరలిపోయినట్లు అధి కారుల ప్రాథమిక విచారణలో కూడా తేలింది. ఇది జరిగి సుమారు రెండు నెలలు కావస్తోంది. కానీ ఇంత వరకు ఆ ఇసుక దొంగలు ఎవరన్నది జిల్లా అధికారులు తేల్చడం లేదు. పైపెచ్చు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ యార్డు లోడింగ్ కాంట్రాక్టర్‌కు తాజాగా బిల్లు కూడా ఇచ్చేశారు. అంతేకాదు సదరు కాంట్రాక్టర్‌కే మళ్లీ నామినేషన్ పద్ధతిలో ఓ ఇసుక రీచ్‌ను అప్పగించ డం మరింత వివాదాస్పదంగా మారింది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి జిల్లాలోని మర్రిపాడు, మిన గల్లు, పల్లిపాడు యార్డులలో మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయి. మైనిం గ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా డీజీపీ ఎస్ సర్వే చేసి మర్రిపాడులో 1.25 లక్షల టన్నులు, మినగల్లులో 41 వేల టన్నులు, పల్లిపాడులో 8 వేల టన్నులు ఇసుక అందబాటులో ఉందని నిర్ధారించారు. ఇది డిజిటల్ సర్వే కావడంతో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఉండదు. దీంతో ఆ యార్డుల్లో సీనరేజ్, రవాణా వంటి ఖర్చులను కలుపుకొని టన్నును రూ.370 చొప్పున విక్రయిం చడం ప్రారంభించారు. యార్డులను రెవెన్యూ శాఖకు అప్పగించారు. వీఆర్వో లు, ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ల ఆధ్వర్యంలో విక్రయా లు జరిగాయి. లోడింగ్, నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు ఏజన్సీకి అప్పగించారు. మిన గల్లు యార్డు బాధ్యతను కూడా ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. మొత్తంగా విక్రయించిన ఇసుక లెక్కలు తీస్తే 29 వేల టన్ను లు మాత్రమే అమ్మినట్లు తేలింది. మరి ప్రారంభంలో 41 వేల టన్నుల ఇసుక ఉండగా చివరకు 29 వేల టన్నులే విక్రయించడంతో ఏకంగా 12 వేల టన్నుల తేడా రావడం చర్చనీ యాంశంగా మారింది.

ఒత్తిళ్లతో మాఫీ యత్నం

అధికారులపై ఒత్తిళ్లు రావడంతో ఇసుక మాయం వ్యవహారాన్ని మాఫీ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఈ విషయాన్ని జూలై 31న 'మినగల్లు యార్డులో ఇసుక దొంగలు' శీర్షికన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చింది. స్పందించిన కలెక్టర్ ఓ ఆనంద్ మైనింగ్ డీడీ, నెల్లూరు ఆర్డీవోలతో విచారణ కమిటీని నియమించారు. ఇసుక లెక్క తప్పినది వాస్తవమేనని విచారణాధికారులు ప్రాథమిక నివేదిక అందజేశారు. దీంతో లెక్క తేలేవరకు కాంట్రాక్టర్‌కు బిల్లు నిలిపేయాలని అప్పట్లో కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే, రెండు నెలలు గడిచింది కదా అంతా మర్చి పోయి ఉంటారులే అన్న భావనో ఏమో గానీ తాజాగా కాంట్రా క్టర్‌కు బిల్లు చెల్లించడం గమ నార్హం. మరి ప్రభుత్వ ఖజానాకు వాటిల్లిన రూ.45 లక్షల నష్టాన్ని ఎవరి నుంచి వసూలు చేస్తార న్నది ఉన్నతాధి కారులే చెప్పాలి. కాగా, దీనిపై జాయింట్ కలెక్టర్ కే కార్తీక్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు కొంత మేర మాత్ర మే బిల్లు ఇచ్చామని, మిగిలినది ఆపా మని చెప్పారు. లెక్కతేలని ఇసు కపై విచారణ జరుగు తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కంటైనర్ టెర్మినల్ కోసం పోరాటం

- రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు ● 40 మందితో కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం కంటై నర్ టెర్మినల్ పునఃప్రారం భించే వరకు పోరాటం ఆగదని వివిధ సంఘాల నాయకులు వెల్లడించారు. నెల్లూరు లోని డాక్టర్ జెట్టి శేషా రెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ అధ్యక్షతన గురువారం రౌండ్ టేబు ల్ సమావేశం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు ఒక ప్రధాన ఉద్యోగ కల్పనా కేంద్రం అన్నారు. అందులో భాగమైన కంటైనర్ టెర్మినల్‌లో వేలాది ఉద్యోగులను నియమించార న్నారు. ఆ టెర్మినల్‌ను మూసివేయటంతో 10వేల మంది ఉద్యోగులు వీధినపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ అదానీ కృష్ణపట్నం పోర్టు వల్ల భవిష్యత్తులో స్థానికులు కాలుష్యంతో జీవనం సాగించాల్సి వస్తుందన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకుడు రాంబాబు, ఆర్‌ఎస్‌పీ నాయకుడు రవికాంత్, ఫార్వర్డ్ బ్లాక్ నేత నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అండ చూసుకుని అదానీ జిల్లా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం 40 మందితో కమిటీని ఏర్పాటు చేసి టెర్మినల్ కోసం పోరాటం చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, సీపీఐ నేత రామరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ కిశోర్, రైతు సంఘం నాయకుడు మూలి వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారా ఉన్నత శిఖరాలు



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

తోటపల్లిగూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారా ఉన్నత శిఖ రాలను అధిరోహించవచ్చని జిల్లా ఉప విద్యాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మహాలక్ష్మీపురంలోగల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సీనియర్ విభాగంలో ఐదుగురికి ఎంపిక చేశారు. బుచ్చిరెడ్డిపాలెం నుంచి ముగురు, కోడూరు, సంగం గురుకుల పాఠశా లల నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారు. జూనియర్ విభాగంలో బోగోలు, ముత్తు కూరు, ఆదురుపల్లి, కందలేరు, సంగం గురుకుల పాఠశాలల నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా ఉప విద్యాశాఖాధికారి విజయలక్ష్మి, జిల్లా గురుకుల పాఠశాలల కో ఆర్డినేటర్ జయలక్ష్మి, సమగ్ర ఏఎంవో సుధీర్‌బాబు, ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, జయరాంనాయుడులు అభినందించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చంద్రమౌళి, ఫణికుమార్, యానాదిరెడ్డి, వివిధ గురుకులాల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు పది జన్మల పాపం : కాంగ్రెస్ నేత కిరణ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : జన్మనిచ్చిన తల్లిని, తోడబుట్టిన చెల్లిని బ్లాక్ మెయిల్ చేసి వైఎస్ జగన్ పది జన్మల పాపాలను మూటగట్టుకున్నాడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారప రెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని జర్నలిస్టు భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆస్తి కోసం తల్లి, చెల్లినే బ్లాక్‌మెయిల్ చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి క్షమించరాని తప్పు చేశాడన్నారు. వైఎస్ షర్మిలను పొలిటికల్‌గా సరెండర్ చేసుకోవడానికే జగన్ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నట్టు స్పష్టంగా తెలుస్తోందన్నారు. సరస్వతీ పవర్, సిమెంట్ ఫ్యాక్టరీ ఆస్తులను భారతి పేరుతో సొంతం చేసుకోవాలనుకునే కుట్రలో భాగంగానే వైఎస్ షర్మిలపై ఆరోపణలు చేయడం తగదన్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లు

- మట్టిరోడ్లను తలపిస్తున్న వైనం
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- తాత్కాలిక మరమ్మతులు చేయాలంటున్న మండల ప్రజలు



ఎల్ఆర్ అగ్రహారం రోడ్డు మలుపు వద్ద ఏర్పడిన పెద్ద గుంత

జలదంకి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లపై ఉన్న గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలదంకి-తెల్లపాడు ఆర్అండ్‌బీ రోడ్డు రెండులైన్ల రోడ్డుగా మార్పు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు. రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఉండటంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. బ్రాహ్మణక్రాక నుండి కమ్మవారిపాలెం, చామదల గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రయాణం ప్రయాణికులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. మరమ్మతులకు నోచుకోకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే 11వమైలు నుండి బ్రాహ్మణక్రాకు వెళ్లే పీఆర్ రోడ్డు అయితే మరీ అధ్వానంగా ఉంది. తారురోడ్డు కాస్తా మట్టిరోడ్డుగా మారిపోయింది. జలదంకి నుండి ఎల్.ఆర్అగ్రహారంకు వెళ్లాలంటే 167 బిజి నెంబరు జాతీయ రహదారి పరిస్థితి అలాగే ఉంది. జలదంకిలోని గట్టుపల్లి రోడ్డు సమీపంలో కావలి-ఉదయగిరి ఆర్అండ్‌బీ రోడ్డుపైన అడుగులోతున పెద్ద గుంత ఏర్పడింది. చాలారోజులు అవుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు దీన్ని పూడ్చే ఏర్పాటు చేయడం లేదు. కనీసం ప్రమాద సూచిక కూడా ఏర్పాటు చేయలేదు. ఇటీవల కురిసిన వర్షంతో అందులో నీరునిలిచి మరింత ప్ర మాదకరంగా ఉంది. 9వమైలు నుండి బ్రాహ్మణక్రాక వరకు ఇలానే ఉంటే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో తాత్కాలిక మరమ్మతు చేపట్టడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఈ గుంటలను పూడ్చాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

పొగాకు నష్టాలపై అవగాహన

సీతారామపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పొగాకు వాడితేకలిగే నష్టాలపై పీహెచ్‌సీ వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో గోడ పత్రికలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం రత్తమ్మ, హెచ్ఎం శ్రీనివాసులు, ఆశా వర్కర్ వసంత పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పని చేయాలి

లింగసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేస్తే ప్రభుత్వం నిర్దేశించిన రూ.300ల కూలీ డబ్బులు వస్తాయని కందుకూరు ఉపాధిహామీ ఏపీడీ బాబూరావు తెలిపారు. గురువారం ఆయన ఎర్రారెడ్డిపాలెంలో కుంట పూడికతీత, పెంట్రాల పంచాయతీ చీమలపెంటలో జరుగుతున్న కాలువ పూడిక తీత పనులను ఆయన ఏపీఓ షేక్ సమీర్‌బాషాతో కలిపి పరిశీలించారు. బోగస్ మస్టర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈసీ చిన కోటయ్య, ఎఫ్ఏలు నారాయణ, దార్ల మధు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ఉలవపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):రాజుపాలెం జంక్షన్ వద్ద చిన పట్టపుపాలెం ప్రయశకావేరి శివ మద్యం అమ్ముతుండగా అతని వద్ద నుంచి 54 మద్యం బాటి ళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

నష్టపోయిన వారందరికీ పరిహారం: ఎమ్మెల్యే కాకర్ల



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 167-బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు నష్టపోయిన వారందరికీ సకాలంలో నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం దుత్తలూరు సెంటర్‌లో సీతారామపురం-దుత్తలూరు వరకు జరుగుతున్న జాతీయ రహదారి, ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాకర్ల మధు, లింగాల నాగిరెడ్డి, వెంకటేశ్వ రరెడ్డి, హనుమంతు నాయుడు, తహసీల్దారు నాగరాజు పాల్గొన్నారు.

- కలిగిరి : పట్టణానికి కూడా బైపాస్ మార్గం ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన బైపాస్ మార్గానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం క్రిష్టారెడ్డి, బి.వి రామారావు, పూసాల వెంగపనాయుడు, మొక్కా హజరత్ బాబు, బుజ్జయ్య పాల్గొన్నారు.

పనితీరును బట్టి పార్టీ పదవుల్లో ప్రాధాన్యం : ఎమ్మెల్యే దగుమాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కోసం ఎక్కువగా కృషి చేసిన వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడి పిలుపును అదృష్టంగా భావించి ప్రతిఒక్కరూ తమ పరిధిలోని ఓటర్లలో 50శాతం లక్ష్యంగా టీడీపీ సభ్యత్వం చేసి రాష్ట్రంలోనే కావలి నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండేలా చూడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని నారాయణ కల్యాణ మండపంలో నియోజకవర్గ నేతలు, కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వ నమోదుపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్నవారికి పార్టీపరంగా కలుగు ఉపయోగాలను క్యాడర్‌కు తెలియచేస్తూ ఎవరి స్థాయిలో వారు సభ్యత్వ నమోదు చేయించాలన్నారు.

- గత పాలకులతో నిర్లక్ష్యంతో..

జాతీయ రహదారి, సముద్ర తీరం వెంబడి ఉన్న కావలి నియోజకవర్గానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదంటే గత పాలకుల నిర్లక్ష్యమే కారణం అన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో కలిసి కావలిని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. పార్లమెంట్ పరిశీలకుడు కార్తీక్ సభ్యత్వ నమోదుపై డిజిటల్ స్క్రీన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బీద గిరిధర్, అన్నదాత మణి, పమిడి రవికుమార్‌చౌదరి, గుత్తికొండ క్రిషోర్, జ్యోతిబాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, పాలిశెట్టి, పోతుగంటి అలేఖ్య, గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, మలిశెట్టి విజయలక్ష్మీ, ఆవుల రామకృష్ణ, మొగిలి కల్లయ్య, మాలేపాటి నాగేశ్వరరావు, హనుమంతరావు , బండి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో కావలి డీఎస్పీ తదితరులు

కావలి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం కావలి డీఎస్పీ కార్యాలయంలో వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోలీస్‌లు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో మీసేవ షౌండేషన్, రహీం చారిటబుల్ ట్రస్ట్, గుడ్‌మెన్స్ చారిటబుల్ ట్రస్ట్, ప్రియదర్శిని మహిళామండలి సభ్యులు పోలీస్ అధికారులు, సిబ్బంది, ఆటో డ్రైవర్లు 150మంది పాల్గొని రక్తదానం చేశారు. ఏరియావైద్యశాల రక్తనిధి కేంద్ర సిబ్బంది, రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్ర సిబ్బంది రక్తసేకరణ చేపట్టారు. ప్రతి ఏటా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐలు ఎండీ ఫిరోజ్, శ్రీనివాస రావు, రాజేశ్వరరావు, పాపారావు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు వినయకుమార్, మహ్మద్ అబ్దుల్ హలీమ్, సోమిశెట్టి బ్రహ్మయ్య, ఎస్‌కే ఖాదర్‌బాష, రెడ్‌క్రాస్ కన్వీనర్ రవిప్రకాష్ , మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, డాక్టర్ విజయరాణి పాల్గొన్నారు.

బీజేపీలోకి అమరా సుబ్బారావు



అమరా సుబ్బారావుకు బీజేపీ కండువా కప్పుతున్న బ్రహ్మానందం, సత్యం

కావలి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వస్త్ర వ్యాపారి ఏపీ జీఎస్టీ గ్రీవెన్స్ సెల్ మెంబర్ అమరా సుబ్బారావు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం అన్నపూర్ణ క్లాత్ మార్కెట్ సముదాయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం, నియోజకవర్గ కన్వీనర్ సీవీసీ సత్యంల సమక్షంలో ఆయన 30మంది అనుచరులతో కలిసి బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో నేతలు సుధీర్, కిరణ్ పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

ఉలవపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార పెరటి తోటల పెంపకంతో కలిగే ప్రయోజనాలను కందుకూరు కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త నిహారిక వివరించారు. గురువారం కరేడు అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల సిబ్బంది, విద్యార్థులకు సమతుల్య ఆహారం వాటి పోషక విలువ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆకుకూరలు, కూరగాయ విత్తనాలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అరుణ, సూపర్‌వైజర్ నాగలక్ష్మీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దుంపవారిల్లిలో పశు వైద్యశిబిరం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దుంపవారిపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా గురువారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులు, కోళ్లకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, జిల్లా పశు గణాభి వృద్ధి సంస్థ ఈవో శ్రీనివాసరావు, ఉదయగిరి ఏడీ శశిధర్, గండిపాళెం, పెద్దిరెడ్డిపల్లి అనూష, రాఘ వేంద్ర శర్మ, పశు సంవర్ధక సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిని సరఫరా చేయండి

- మున్సిపల్ కమిషనర్‌కు 36వ వార్డు ప్రజల వినతి

కావలి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా తమ కాలనీకి తాగునీటి సరఫరా నిలిచిపోయిందని తక్షణమే నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని 36వ వార్డు (వైకుంఠపురం) ప్రజలు గురువారం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వైకుంఠపురం పెంకులఫ్యాక్టరీ రోడ్డు పరిసరాల్లో 200కు పైగా కుటుంబాలు నివాసముంటున్నామని చెప్పారు. అందరూ కూలీపనులు చేసుకునేవాళ్లమన్నారు. మున్సిపల్ ట్యాకర్లతో జరిగే నీటి సరఫరా వారం నుంచి నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వీరి వెంట సీపీఎం నేతలు పెంచులయ్య, కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, అక్టోబరు 24: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఫైనలియర్ విద్యార్థులు కార్పొరేట్ ఉద్యోగాల ఎంపికలో ప్రతిభ చూపినట్లు కళాశాల టెక్నికల్ డైరక్టర్ విజయ్‌శ్రీనివాస్ గురువారం తెలిపారు. కళాశాలలో క్యూ స్పైడర్స్ కంపెనీ నిర్వ హించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 31మంది ఉ ద్యోగాలకు ఎంపిక అవడం హర్షనీయం అని పేర్కొన్నారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఎంపికల కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, డాక్టరు ఎం. లక్ష్మణరావు, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి మాధవరావు, మీరావలి, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులు సవరించుకోండి

అల్లూరు, అక్టోబరు 24: రీసర్వే ప్రక్రియలో చోటు చేసుకున్న తప్పులను సవరించుకోవాలని తహసీల్దారు లక్ష్మీ నారాయణ తెలిపారు. నార్తుమోపూరులో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గతంలో చేపట్టిన రీసర్వే ప్రక్రియతో అనేక సమస్యలు ఏర్పడినట్లు ప్రజలు గ్రామసభల దృష్టికి తీసుకొస్తున్నట్లు తెలిపారు. వీటిని ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు



రైతులకు ఈ-క్రాప్ నమోదు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఏడీఏ దేవసేనమ్మ

ఆత్మకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మకూరు వ్యవసాయ సహాయ ఉప సంచాలకులు దేవసేనమ్మ తెలిపారు. ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం, బట్టేపాడు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రస్తుత రబీ సీజన్‌కు అనువైన వరి రకాలు, విత్తనశుద్ధి, నా రుమడుల పెంపకం, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ-క్రాప్ నమోదు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు వ్యవ సాయ సహాయకులు అర్చన, జాన్సీరాణి పాల్గొన్నారు.

కనుపూరు కాలువ రెగ్యులేటర్ పరిశీలన



కనుపూరు కాలువ పాత రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న డీఈ అనిల్ కుమార్‌రెడ్డి

సంగం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీకి దక్షిణం వైపు ఉన్న కనుపూరు కాలువ పాత హెడ్ రెగ్యులేటర్‌ను డీఈ అనిల్‌కుమార్‌రెడ్డి గురువారం పరిశీలించారు. రెగ్యులేటర్ ప్రారంభం వద్ద నీటి విడుదలకు అడ్డంకిగా ఉన్న మట్టికట్టలను పరిశీలించి తొలగించాలని ఏఈ బాలుకు సూచించారు. రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా కాలువను పరిశీలించినట్లు తెలిపారు. కాలువలో గుర్రపుడెక్క, పూడిక తొలగించేందుకు ఓఅండ్ఎం నిధుల కింద ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈ వినయ్ కుమార్, ఏఈ బాలు, సిబ్బంది ఉన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసన, పఠన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు సూచించారు. గురువారం పట్టణంలోని షబ్బీర్ కాలనీ ఉర్దూ, మండలంలోని అప్పసముద్రం ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మన బడి-మన భవిష్యత్తు పనులు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీచేసి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయకుమార్, లియాఖత్ పాల్గొన్నారు.

ప్రజావేదిక ఏర్పాట్ల పరిశీలన



అధికారులు, నాయకులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి సీఈవో

అనంతసాగరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనంతసాగరంలో ఈనెల 28న చేపడుతున్న ప్రజావేదిక పనులను జిల్లా ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి హాజరుకానుండగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ప్రజలు సమస్యలు పరిష్కరించుకునేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, టీడీపీ నాయకులు మెట్టుకూరు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా

సబ్సిడీపై విత్తనాలు

- వడ్డి రాము, కందుకూరు మండల వ్యవసాయాధికారి



ఇంటర్వ్యూ

కందుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువుల కొరతను అధిగమించడం తోపాటు సబ్సిడీపై విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని కందుకూరు వ్యవసాయ అధికారి వడ్డి రాము అన్నారు.

? రబీ సీజన్‌లో రైతులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు

! మినుములో పీబీఎన్8 కరం మినీ కిట్లు కూడా ఉచితంగా అందజేస్తున్నాం. మండలానికి 4కిలోల మినీకిట్లు 380రాగా చేశాం. విత్తనశుద్ధికి సబ్సి డీపై 200 కిలోల ట్రైకోడెర్మావి రిడి సిద్ధం చేశాం. సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధం చేశాం

? శనగ సాగుకు ఇంకా సమయం ఉంది కదా ?

! ఈ ఏడాది మంచి అదనులో వర్షాలు కురిసి నందున నీరునిలిచే పల్లపు నేలల్లో మినహా మిగిలిన మిగిలిన నేలల్లో సాగు చే స్తే దిగుబడులొస్తాయి.

? మందుల సమస్య

! యూరియా, డీఏపీ నిల్వలు పెంచేలా చర్య తీసుకుంటున్నాం. పీఏసీ ఎస్‌ల కోటాను రైతుసేవా కేంద్రా లకు వచ్చేలా ఉన్నతాధికారులను ఒప్పించాం.

న్యూస్ బాక్స్

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఆత్మకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు, అర్హులైన వారు శుక్రవారం సాయంత్రంలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఇన్‌చార్జ్ ఏఎస్‌డబ్ల్యువో ఆదిలక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆన్‌లైన్‌లో నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన వారిని ఎంపికచేసి మూడు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమన్వయంతో సభ్యత్వ నమోదు

కందుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రారంభమైన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సమన్వయంతో చేయాలని ముస్లిం మైనారిటీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

కందుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞానకేంద్రంలో నెల్లూరు జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) ఆధ్వర్యంలో గురువారం గ్రామ రైతుసేవా కేంద్రాల సిబ్బందికి రబీ పంటలో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కందుకూరు ఏడీఏ డాక్టరు అనసూయ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు ప్రసాద్‌బాబు, డీఆర్‌సీ ఏడీఏ లక్ష్మీ మాధవి, డీఎస్‌టీ కల్లూరి శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు వెంకటేష్, జ్యోతి, వివేక్, శ్రీరంగ, ఏఓలు వి.రాము, హేమంత్ భరత్ కుమార్, రవికుమార్, గీతాకుమారి పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినం

కందుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు రాజగోపాలబాబు, రామాంజనేయులు, షహనాజ్‌బేగం, నరేష్ రాజ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

వింజమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బొమ్మరాచెరువులో గురువారం నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రఘునాథ్, సచివాలయ పశు వైద్య అసిస్టెంట్ వీరశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగణన సర్వే

వరికుంటపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో శుక్రవారం నుంచి జాతీయ పశుగణన సర్వే నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి పశువులు, కుక్కలు, కోళ్ల వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు.

రుణాల వసూళ్లపై దృష్టి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదుపు సంఘాల్లో పనిచేసే సీసీలు, వీవోఏలు, సంఘబంధ అధ్యక్షులు రుణాల వసూళ్లపై దృష్టి కేంద్రీకరించాలని ఏపీఎం సయ్యద్ ఖాజారంతుల్లా పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి మరొకరికి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంకు మేనేజర్ శివకృష్ణ, సీసీలు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

వరికుంటపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు. ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశం జరుగుతుందన్నారు.

కుండీలు పోయి
కమ్ములు మిగిలాయి !

నగరంలో చెత్త సేకరణకు కార్పొరేషన్ అధికారులు కొన్నేళ్ల క్రితం స్టీలు కుండీలు ఏర్పాటు చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసేందుకు నగర వ్యాప్తంగా స్టీలు కమ్ములకు రెండు, మూడు చొప్పున కుండీలు తగిలించారు. అయితే పలుచోట్ల ఆ డస్ట్‌బిన్లు మాయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో కుండీలే మాయం కాగా మరికొన్ని చోట్ల స్టీలు రాడ్లతో సహా మొత్తం మాయం చేశారు. ఫలితంగా స్థానికులు చెత్తను రోడ్లపైనే పడేస్తున్నారు.

-నెల్లూరు సిటీ, (ఆంధ్రజ్యోతి)



బిన్నులు లేని స్టీల్ రాడ్డులు

'నారాయణ'లో స్ట్రోక్ పరీక్షల్లో రాయితీ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈ నెల 29 నుంచి నవంబరు 28 వరకు బ్రెయిన్ స్ట్రోక్ పరీక్షల్లో రాయితీ ఇస్తున్నట్లు మంత్రి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి వెల్లడించారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రూ.5వేల విలువైన ఎమ్మారై, టెస్లా, కరోటిన్ డాప్లర్, లిపిడ్ ప్రొఫైల్ తదితర అన్ని రకాల పరీక్షలు కేవలం రూ.2500కే అందిస్తామని తెలియచేశారు. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు గుర్తించిన వెంటనే చికిత్సలు అందిస్తే వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఏటా అక్టోబరు 29ని స్ట్రోక్ డేగా జరుపుకుంటామన్నారు. రాయితీ పరీక్షలకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ 9640 100555 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం రాయితీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కాంత్, న్యూరాలజిస్ట్ డాక్టర్ అనూష, ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమాదేవి, వైద్య నిపుణులు

పార్కులన్నింటినీ అందుబాటులోకి తేవాలి

నెల్లూరు(సిటీ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పా ర్కులన్నిటినీ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి, వీలైన చోట్ల పచ్చదనం పెంచేందుకు అవసరమైన వనరులను ఉపయోగించుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని గాంధీనగర్, రిత్విక్ ఎన్‌క్లేవ్, ముత్తుకూరు కూడలి వద్ద ఫ్లైఓవర్ వంతెన, మినీబైపాస్‌లోని నుడా పార్కును పరిశీలించారు. పార్కులకు ప్రహరీ, గేట్లు, వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని, అందాన్నిచ్చే మొక్కలు పెంచి, ఆట వస్తువులు, వ్యాయామ సామగ్రి సమకూర్చాలని సూచించా రు. కమిషనర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన సిటీ ప్లానింగ్ అధికారులు అన్నమయ్య సర్కిల్ వద్ద ఆక్రమణలను తొలగించి, కట్టడాలను కూల్చివేశారు.

సమగ్రతతో రెవెన్యూ రికార్డుల తయారీ

నెల్లూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖకు సంబంధించి గ్రామాల్లో సమగ్రమైన వివరాలు సేకరించి, క్షుణ్ణంగా పరిశీ లించిన తరువాతే వాటిని రికార్డు చేయడం జరుగుతుందని నెల్లూరు రూరల్ తహసీల్దారు లాజరస్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. మండ లంలోని పెనుబర్తి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రెవెన్యూ రికార్డులతో సమస్యలు ఏర్పడ్డాయన్నారు. వాస్తవాలకు భిన్నంగా రికార్డులు తయారు చేశారని తెలిపారు. ప్రస్తుత సదస్సుల్లో వాస్తవాలను తెలుసుకుని ఆన్‌లైన్ ద్వారా రికార్డు చేస్తున్నారని చెప్పారు. ప్రతీ సమస్యను సదస్సు దృష్టికి తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో రెవె న్యూ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

తూము గేట్లు దెబ్బతింటే పట్టించుకోరా ?

విడలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చెరువు తూములకు ఉన్న గేట్లు (అడ్డ చెక్కలు) దెబ్బతింటే ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని చౌకిచర్ల గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. చౌకిచర్ల చెరువుకు మొత్తం ఏడు తూములు ఉన్నాయని, వాటిలో 2, 4 తూములకు ఉన్న గేట్లు దెబ్బతిన్నాయని తెలిపారు. ఇవి దెబ్బతిని సుమారు రెండేళ్లు గడుస్తున్నా ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని తూము గేట్లు మరమ్మతులు చేయించాలని వారు కోరారు.ఈ సమావేశంలో రైతులు పోలిరెడ్డి ఆశోక్‌రెడ్డి, కొమ్మిరెడ్డి విజయ, చినరాగయ్య, బయ్యా శ్రీనివాసులు, అలగర వెంకటేశ్వర్లు, గిలకా రవి, గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారెంటు విషయంలో వివాదం

● పరస్పర ఫిర్యాదులతో కేసు నమోదు

నెల్లూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని నవలాకులతోట ప్రాంతం 4వ మైలు వద్ద కోర్టు వారెంటు విషయంలో వివాదం నెలకొంది. ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోవడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వివరాలను సీఐ వేణు వెల్లడించారు. రాజమండ్రి జిల్లాకోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్న వైఎంఎల్ సంధ్యరాణి నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను అమలు చేయడానికి మరో న్యాయవాదితో కలిసి గురువారం నెల్లూరు వచ్చారు. 4వ మైలు వద్దనున్న అశోక్ నగర్‌లోని షేక్ సుల్తానా కోసం వారు వచ్చారు. వారెంట్ అమల్లో భాగంగా ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించగా ఆ ఇంట్లో ఉన్న ప్రభావతి, ఆమె భర్త, అల్లుడు అడ్డుకుని దుర్భాషలాడి, సుమారు రూ. 60 వేల విలువగల ఫోన్ పగలుకొట్టారని న్యాయవాదులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఇదే అంశంపై బొందిలి ప్రభావతి కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుల్తానా అనే మహిళ తన తల్లి ఇంటిపక్కన ఇంట్లో ఉంటుందని చెప్తున్నప్పటికీ వినకుండా అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి తన మెడపై చెయ్యివేశారని, ఆ సమయంలో బంగారు గొలుసు తెగిందని, దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు, అర్హులైన వారు శుక్రవారం సాయంత్రం లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఇన్‌చార్జ్ ఏఎస్‌డబ్ల్యూవో ఆదిలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

'నాడు - నేడు' పేరుతో భారీ అవినీతి

● సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ టెండర్‌లో అక్రమాలు
● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో నాడు- నేడు పేరుతో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, దీనిపై ప్రభుత్వ సమగ్ర విచారణ జరిపించాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రూ.2560 కోట్లు గ్రాంటు ఇచ్చిందన్నారు. సర్వశిక్షా అభియాన్ పథకం కింద రూ.వెయ్యి కోట్లు గ్రాంటు ఇచ్చిందన్నారు. ప్రపంచ బ్యాంకు రూ. 700 కోట్లు, నాబార్డు రూ. 1200 కోట్లు.. ఇలా మొత్తం కలిపి రూ.6 వేల కోట్లకుపైగా నిధులు వచ్చాయని, వాటిని వైసీపీ ప్రభుత్వం సక్రమంగా వినియోగించలేదని ఆరోపించారు. ఈ నిధుల్లో రూ. 1805 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు కేంద్రం తేల్చిందన్నారు. పనులు చేసిన వారికి, మెటీరియల్ సరఫరా చేసిన వారికి రూ. 2400 కోట్లు బకాయిలు ఉన్నాయని చెప్పారు. అలాగే రాష్ట్ర స్థాయిలో సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ పేరుతో టెండర్లు పిలిచి వారికి ఇష్టమైన వారికి కట్టబెట్టారన్నారు. ఈ మెటీరియల్ టెండర్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, దీనిపై కూడా విచారణ జరిపించాలని కోరారు.



మండలంలో పశువైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

తోటపల్లిగూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండపం గ్రామంలో శంకాబ్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈఐఎల్) ఆధ్వర్యంలో గురువారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పశువులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశామని కంపెనీ యాజమాన్యం తెలిపింది. ముఖ్యఅతిథులుగా ముత్తుకూరు పశువైద్య సంచాలకులు డాక్టర్ మురళీకృష్ణ, పశువుల డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఐఎల్ అధికారులు ఆశిష్ హీపర్, ఇంటర్నేషనల్ అధికారులు డాక్టర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి !



నిరసన వ్యక్తం చేస్తున్న అమర్‌నాథ్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లకు ఎంపికయిన వారిలో తనతో పాటు ముగ్గురి పేర్లను ఎందుకు తొలగించారని పంచేడుకు చెందిన పాడిరైతు పెనాక అమర్‌నాథ్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేశారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీడీవోని అడిగితే ఆ గ్రామ ప్రజాప్రతినిధి చెబితేనే పేర్లు తొలగించినట్లు చెప్పారని, అయినా అది శాంక్షన్ జాబితా కాదని చెప్పడం సరికాదన్నారు. నాలుగు రోజుల క్రితం జాబితా విడుదల చేస్తే అందులో నాలుగుపేర్లు ఉన్నాయని, మంగళవారానికి ఆపేర్లు తొలగించి, ఇతరుల పేర్లు చేర్చడం ఎంతవరకు న్యాయమన్నారు. తమకు న్యాయం చేయాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆయన కోరారు.

పోలేరమ్మ జాతర ముగింపు

సైదాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలేరమ్మ జాతర గురువారం రాత్రి ఘనంగా ముగిసింది. ఈసందర్భంగా వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రతిమను నిమజ్జనానికి తరలించారు.

ఎస్ఐకి సన్మానం



సత్కారం అందుకున్న ఎస్ఐ

విడవలూరు, అక్టోబరు 24,(ఆంధ్రజ్యోతి): ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన నరేష్‌కుమార్ యాదవ్‌ని గురవారం పార్లపల్లి గ్రామ టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాతా బాలకృష్ణ, మదన్, సురేష్ రాజేష్ సన్మానించారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడాలని వారు కోరారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు వాణిశ్రీ పాఠశాల విద్యార్థులు

నెల్లూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా హిందుపురంలో శుక్రవారం నుంచి జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు వాణిశ్రీ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొంటున్నారని ఆ స్కూల్ హెచ్ఎం షేక్ అన్వర్‌హుస్సేన్, పీడీ నాగేంద్రరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో తమ విద్యార్థులు శివశంకర్, మహి, నందిని ప్రియ, నిత్య మాధురి, శ్వేత ఎంపికయ్యారని తెలిపారు.

పాఠశాలకు మౌలిక వసతులు కల్పిస్తా..!

తోటపల్లిగూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. మండలంలోని చిన్నచెరుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో, విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని మౌలిక వసతులు గురించి తెలుసుకున్నారు. మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను డీఈవోతో మాట్లాడి భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చిన్నచెరుకూరు పాఠశాలలను తనిఖీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

క్షయ నివారణకు చర్యలు : ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణ చర్యలు విధిగా చేపట్టాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. గురువారం నగరంలోని మల్లికార్జునపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆ యన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ క్షయ వ్యాధి నివారణకు చేపడుతున్న పరీక్షలు, వ్యాక్సిన్ పంపిణీ తదితర అంశాల రికార్డులను తనిఖీ చేశారు. క్షయ నివారణలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని వైద్యులు, సిబ్బందికి సూచించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

కాకాణీ... నోరు అదుపులో పెట్టుకో !

మనుబోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. గురువారం మండలపరిషత్ కార్యాలయ ఆవరణంలో ఆయన మాట్లాడారు. సోమిరెడ్డిపై అసభ్యకరంగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. తమ నాయకుడు దేగపూడి-బండేపల్లి కాలువ మంజూరు చేయిస్తే, దాన్ని అడ్డుకుంది మీరు కాదా? అంటూ ప్రశ్నించారు. అనంతరం ఎస్ఐ శివరాకేష్‌కు కాకాణిపై చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాయపాటి కిరణ్‌కుమార్, నూనె లక్ష్మయ్య, ఉడతా విజయ్‌కుమార్, సాని వెంకటరమణయ్య, వెడిచెర్ల వెంకటరమణారెడ్డి, చెల్లగిరి ప్రసాద్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

● కాకాణి భూదాహానికి అధికారుల బలి

పొదలకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి భూదాహానికి మండల రెవెన్యూ అధికారులు బలయ్యారని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాకాణి సొంత మండలమైన పొదలకూరులో రెవెన్యూ రికార్డులను అస్తవ్యస్తంగా చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోని ఇద్దరు తహసీల్దారులు వందల ఎకరాల భూములకు రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి వారికి అనుకూలమైన వారికి ఇచ్చుకున్నారని తెలిపారు. ఇదంతా తెలిసి కూడా కాకాణి తెలియకుండా ఉన్నారా? అని దుయ్యబట్టారు. కాకాణి టైంలో వేసిన 52లే అవుట్లకు అనుమతులు లేవని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, అలుపూరు శ్రీనివాసులు, పులిపాటి వెంకటరత్నంనాయుడు, బక్కయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌కు ఉచిత స్ర్కీనింగ్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో రొమ్ము కేన్సర్‌కు ఉచిత స్ర్కీనింగ్ నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి కేన్సర్ విభాగం హెడ్ డాక్టర్ బిందురెడ్డి వెల్లడించారు. ఆసుపత్రిలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రతి మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రొమ్ము కేన్సర్‌కు మామొగ్రామ్ పరీక్షలు చేస్తామని చెప్పారు. డిసెంబరు 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం చేపడతామని తెలిపారు. 45 ఏళ్ల పైబడిన వారు తప్పనిసరిగా ఈ స్ర్కీనింగ్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రంగరామన్, మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ ప్రియ మాట్లాడుతూ రొమ్ము కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షల పోస్టర్లు ఆవిష్కరించారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్య నిపుణులు

అంబటి మాలకొండయ్యకు ఘన నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కమ్మ జన సంక్షేమ సమితి మాజీ కార్యదర్శి, గౌరవ సలహాదారుడు అంబటి మాలకొండయ్య సంతాప సభ గురువారం నగరంలోని కమ్మ జన సంక్షేమ సమితి కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా నాయ కులు మాలకొండయ్యకు ఘనంగా నివాళులర్పిం చారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు రుద్ర పాటి వెంకటేశ్వర్లు నాయుడు, కార్యదర్శి పులిపా టి నాయుడు, కోశాధికారి నలమోలు బలరామ య్య నాయుడు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాలకొండయ్యకు నివాళులర్పిస్తున్న కమ్మ జన సంక్షేమ సమితి నాయకులు

బాగా చదువుకోండి : మేయర్

నెల్లూరు(సిటీ),అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కష్టపడి బాగా చదువుకుని, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలంటూ కార్పొరేషన్ మేయర్ పోట్లూరి స్రవంతి ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు సూచించారు. గురువారం నగరంలోని మున్సిపల్ కళాశాలలో విద్యార్థులతో ఆమె ముఖాముఖీ నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్నంత స్వేచ్ఛ, నిపుణులైన అధ్యాపకులు మరెక్కడా ఉండరన్నారు. ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పడంతో, తమకు తాగునీటి ఇబ్బంది ఉందని విద్యార్థులు తెలిపారు. దీంతో సమస్యను పరిష్కరిస్తానని మేయర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కళాశాల ఏవో రాజేంద్రప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

మద్యం దుకాణం వద్ద రసాభాస : లాగి పడేసిన పోలీసులు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో చిల్డ్రన్స్ పార్కు ప్రాంతంలోని జగదీష్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వైన్స్ దుకాణం వద్ద గురువారం ఉద్రిక్తత నెలకొంది. ఆ దుకాణాన్ని తొలగించాలంటూ స్థానికులు కొద్ది రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. గురువారం సైతం నిరసన వ్యక్తం చేయడంతో వైన్స్ షాపు యజమానులు తీసుకువచ్చిన జనం, పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది మోహరించారు. ఆందోళనకారులను నెట్టేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొంది. చివరకు పోలీసుల పహారాలో మద్యం విక్రయాలు సాగాయి. దీనిని చూసిన ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన తమ కంటే మందు వ్యాపారులు ఎక్కువయ్యారంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



మహిళలను పక్కకు లాగేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

న్యూస్ బాక్స్

పట్టుబడిన ఇసుక టిప్పర్లు

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 8 టిప్పర్లను నైట్‌బీట్ పోలీసులకు బుధవారం అర్ధరాత్రి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వీటిలో జొన్నవాడకు చెందిన టిప్పర్లు నాలుగుకాగా, మిగిలినవి ఇతరులవని తెలుస్తోంది. ఈ టిప్పర్లు పొట్టేపాళెం రీచ్ నుంచి వస్తుండగా పట్టుకున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఉద్యోగుల ఆరోగ్యానికి కృషి

ముత్తుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, కార్మికులు, ఆరోగ్య పరిరక్షణకు అదానీ కృష్ణపట్నం పోర్టు కృషి చేస్తున్నదని పోర్టు సీఈవో జగదీష్ పటేల్ తెలిపారు. గురువారం పోర్టు లాజిస్టిక్స్ వర్క్‌షాప్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ శిబిరంలో నెల్లూరు అపోలో హాస్పిటల్, అదానీ మెడికల్ సెంటర్ డాక్టర్ శ్రీవర్, డాక్టర్ వీరరాఘవ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీవోవో రాజన్‌బాబు, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, మనీష్‌దేవ్, లాజిస్టిక్ హెడ్ శ్రీధర్, వేణుగోపాల్‌రెడ్డి, వివేక్ నారాయణ, మధుసూదన్, వేణు, మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల రక్తదానం

ముత్తుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పోలీసులు రక్తదానం చేశారు. కృష్ణపట్నం సీఐ రవి నాయక్ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మల్లికార్జునయాదవ్, ఎస్ఐలు విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సమయమిస్తే ఖాళీ చేస్తాం..

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కొంత సమయం ఇప్పిస్తే ఇళ్లు ఖాళీచేసి వెళ్తామని మలిదేవి కాలువకట్టపైన నివాసముండే కోడూరు శేషమ్మ గురువారం జనసేన జిల్లా కార్యదర్శి గునుకుల కిషోర్‌ను వేడుకుంది. దీంతో ఆయన నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దారు వెంకటేశ్వర్లుతో చర్చించగా వారు సానుకూలంగా స్పందించారు. అక్కడే నివసించే అవకాశం కల్పించిన కిషోర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపింది.

స్థలం కేటాయించండి

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని 3,4వార్డుల పరిధిలోని తాగునీటి అవసరాలకోసం వాటర్‌ప్లాంటు ఏర్పాటుకు స్థలం కేటాయించాలని స్థానికులు గురువారం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో తమకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వాటర్ ప్లాంటు ఏర్పాటుకు హామీ ఇచ్చారని తెలిపారు. స్థలం కేటాయిస్తే ప్లాంటు ఏర్పాటు చేస్తారని వివరించారు.

కోటారెడ్డి మృతి తీరనిలోటు

ముత్తుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :పిడతాపోలూరుకు చెందిన కాకుటూరు కోటారెడ్డి మృతి టీడీపీకి తీరని లోటని నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం పిడతాపోలూరులో కోటారెడ్డి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్ రెడ్డి, మల్లికార్జున యాదవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీఏఏలకు శిక్షణ

ఇందుకూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇందుకూరుపేట సబ్‌డివిజన్ పరిధిలోని ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల గ్రామ వ్యవసాయ సహాయకుల(వీఏఏ)కు పంటలసాగుపై జిల్లా వనరుల కేంద్రం అధికారులు గురువారం శిక్షణ ఇచ్చారు. స్థానిక కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి, వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తదితరులు పాల్గొని శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ రాజ్‌కుమార్, ఏవో మధురిమ, శాస్త్రవేత్తలు పరమశివ, ఏవోలు రఘునాథరెడ్డి, శిరీషరాణి, జ్యోత్స్నారాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతపై చర్యలు తీసుకోండి

తోటపల్లిగూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలిమిట్టకండ్రిగలో గల సర్వే నెంబరు 18/7లో 52 సెంట్ల పొలం హద్దులు మార్చి, తమను మోసం చేసిన కోడూరు చెందిన వైసీపీ నేతపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి జనార్దన్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అతనిపైన చీటింగ్ కేసు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులకు, ఎస్ఐకి వినతి పత్రాలు అందజేశారు. 2009 జూలై 28న పెమ్మారెడ్డి శ్రీనివాసులురెడ్డి, తండ్రి వెంకటరమణారెడ్డి వద్ద 52సెంట్ల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తెలిపారు. కానీ సంబంధించిన పొలం హద్దులు వేరే రైతులవని తెలిపారు. ఇలా తనను మోసం చేసిన అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

తిరుపతిలో హోటళ్లకు బాంబు బెదిరింపులు

ఐఎస్ఐ ఉగ్రవాదుల నుంచి మెయిల్ రాక
పోలీసుల ముమ్మర తనిఖీలు


రీనెస్ట్ హోటల్ వద్ద బాంబు స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దేశవ్యాప్తంగా పలు విమానాల్లో బాంబులు అమర్చినట్టు బెదిరింపు మెయిల్స్ పంపిన రీతిలో తిరుపతిలోని హోటళ్లకూ గురువారం సాయంత్రం మెయిల్స్ వచ్చాయి. పాయ్ వైస్రాయ్, రిగాలియా, రీనెస్ట్, రాజ్‌పార్కు హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. వీటిపై పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ వెంకటనారాయణ, అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ నాగార్జున రెడ్డి, బాంబు డిస్పోజల్ (బీడీ) టీమ్ సీఐ శివారెడ్డి తదితరులు బాంబు బెదిరింపు వచ్చిన హోటళ్ల వద్దకు చేరుకున్నారు. బాంబు స్క్వాడ్ ఇన్‌చార్జి వీరయ్య నేతృత్వంలో సిబ్బంది చాంద్‌బాషా, చెంగల్రాయలు, మురళి, ముద్దుకృష్ణ, శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ దయాకర్, రమేష్ బాంబు డిస్పోజల్ పరికరాలతో అన్ని హోటళ్లలో తనిఖీలు చేశారు. మరోవైపు పేలుడు పదార్థాలు పసికట్టే పోలీసు జాగిలం లీలతోనూ అన్ని గదులు, చుట్టుపక్కల ప్రాంతాలు, వంటగదులు, మేనేజర్ గదులు తనిఖీ చేశారు. ఎక్కడా బాంబులు లేవని నిర్ధారణకు రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

స్టార్ ఎయిర్‌లైన్స్ విమానానికీ..

రేణిగుంట, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి):తిరుపతి మీదుగా నడిచే స్టార్ ఎయిర్ లైన్స్ విమానాన్ని బాంబుతో పేల్చివేస్తామంటూ ట్విట్టర్ ద్వారా అగంతకుడొకరు బెదిరించారు. తిరుపతి విమానాశ్రయ అధికారుల కథనం మేరకు... బెంగళూరు నుంచి తిరుపతికి, ఇక్కడి నుంచి బెల్గాంకు సర్వీసులు నడుపుతున్న స్టార్ ఎయిర్ లైన్స్ కంపెనీ విమానాన్ని బాంబులతో పేల్చి వేస్తామంటూ ఓ అగంతకుడు మెసేజ్ పెట్టడంతో గుర్తించిన విమానాశ్రయ అధికారులు, భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. తిరుపతి విమానాశ్రయంలోని కేంద్ర బలగాలు గురువారం మధ్యాహ్నం నుంచి వివిధ ప్రాంతాల నుంచీ వచ్చిన విమానాలను తనిఖీ చేశారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నుంచి సాయంత్రం ఏడు గంటలకు తిరుపతికి చేరుకొని తిరిగి ఏడున్నరకు శివమొగ్గకు బయల్దేరే విమానాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేశారు. అయితే ఎటువంటి పేలుడు వస్తువులు విమానంలో కన్పించకపోవడంతో అది ఒక ఫేక్ కాల్‌గా గుర్తించి విమానాన్ని పంపివేశారు.


తనిఖీలు చేపట్టిన డాగ్ స్క్వాడ్


నిండ్ర ఎస్సీకాలనీలో సర్వేని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ పద్మనాభం

సొంతింటిపై కొంగొత్త ఆశలు

టీడీపీ హయాంలో నిర్మించుకున్నవారి బిల్లుల్ని ఆపిన వైసీపీ సర్కారు
ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల్ని గుర్తించే పనిలో హౌసింగ్ అధికారులు
బిల్లుల మంజూరుకు ప్రస్తుత ప్రభుత్వం ముందడుగు

చిత్తూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 2014-19 మధ్యకాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేసింది. అప్పట్లోనే ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు యూనిట్ కాస్ట్‌గా మంజూరు చేసి 2019 వరకు బిల్లుల్ని కూడా మంజూరు చేసింది. టీడీపీ హయాంలో నిర్మాణాలు చేపట్టి, బిల్లులు మంజూరు కాని లబ్ధిదారులకు... ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూరితంగా బిల్లుల్ని ఆపేసింది. చిత్తూరు జిల్లాలో 29,093 మంది లబ్ధిదారులకు రూ.47.19 కోట్లు, తిరుపతి జిల్లాలో 23,484మంది లబ్ధిదారులకు రూ.39.06 కోట్లను నిలిపేసింది. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు బిల్లులు రాకపోవడంతో నష్టపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారిలో ఆశలు చిగురించాయి.పాత బిల్లుల్ని మంజూరు చేసేందుకు ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల్ని గుర్తించే పనిలో హౌసింగ్ అధికారులు ఉన్నారు. ఎన్టీఆర్ వెరిఫికేషన్ యాప్ ద్వారా చేస్తున్న ఈ సర్వే చిత్తూరు జిల్లాలో గురువారంతో పూర్తయింది.తిరుపతి జిల్లాలో కూడా చివరి దశలో ఉంది. మంజూరైన గృహాలు ప్రస్తుతం ఏ దశలో వున్నాయనే వివరాలు నమోదు చేస్తున్నారు.అలాగే వివిధ దశల్లో ఆగిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పీఎంఏవై-2.0 గ్రామీణ గృహ నిర్మాణ పథకానికి బదలాయించి పనులు పునఃప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోందంటున్నారు . ఏ దశలో ఉన్న నిర్మాణాలను ఈ కేంద్ర పథకానికి వర్తింపజేస్తారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఒక్కో యూనిట్ కాస్ట్‌ను రూ.4 లక్షలు అని ఆ మధ్య సీఎం చంద్రబాబు ప్రకటించినా.. కేంద్ర ప్రభుత్వం తన వాటాను పెంచకపోవడంతో తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2014 నుంచి కూడా కేంద్ర ప్రభుత్వం తన వాటాను రూ.1.50 లక్షలుగా ఇస్తోంది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం అదనంగా రూ.లక్ష వాటా వేసి లబ్ధిదారులకు రూ.2.50 లక్షలిచ్చేది. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం నయాపైసా కూడా రాష్ట్రం తరపున వాటా కేటాయించలేదు. దీంతో చాలామంది లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. జిల్లాకు 72,272 గృహాలు మంజూరైతే సగం కూడా నిర్మాణాలు పూర్తికాలేదు. ఇప్పుడు కూడా కేంద్రం తన వాటా పెంచకపోవడంతో.. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు యూనిట్ కాస్ట్ ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.


శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో సర్వే చేస్తున్న సిబ్బంది

ఎన్టీఆర్ గ్రామీణ గృహ లబ్ధిదారుల వివరాలు

జిల్లా	గృహాలు	పెండింగ్ బిల్లులు రూ.కోట్లలో
చిత్తూరు	29,093	రూ.47.19
తిరుపతి	23,484	రూ.39.06

డీఆర్వోగా నరసింహులు

● ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీ
● తిరుపతి ఆర్డీవోగా రామ్మోహన్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డీఆర్వోగా జి.నరసింహులును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 37మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ తూర్పు గోదావరి జిల్లా డీఆర్వో (జిల్లా రెవెన్యూ అధికారి)గా పనిచేస్తున్న నరసింహులును ఇక్కడకు పంపారు. ఇక్కడ పనిచేస్తున్న పెంచలకిషోర్‌ను జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డీసీగా విధులు నిర్వహిస్తూ తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా వ్యవహరిస్తున్న బి.రామ్మోహన్‌ను తిరుపతి రెగ్యులర్ ఆర్డీవోగా నియమించారు. వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్(వీసీఐసీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న కేటీ నరసింహులును జీఎన్ ఆర్డీవోగా నియమించారు. తిరుపతి జిల్లా ప్రొటోకాల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.చంద్రశేఖర్‌నాయుడును చీరాల ఆర్డీవోగా నియమించారు. జిల్లాలోని ల్యాండ్ ప్రొటెక్షన్, వీసీఐసీ, ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు ఎవరినీ నియమించలేదు. తిరుపతి జిల్లా డీఆర్వోగా అవకాశం రావడం పూర్వజన్మ సుకృతమని జి.నరసింహులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. గతేడాది సెప్టెంబరులో డీఆర్వోగా పెంచలకిషోర్ బాధ్యతలు స్వీకరించారు. ఏడాది పాటు తిరుపతిలో విధులు నిర్వహించడం సంతోషం కలిగించిందని చెప్పారు.


నరసింహులు

డీఈవోగా కేవీఎన్ కుమార్



తిరుపతి(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా కేవీఎన్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీఈవోగా పనిచేస్తున్న డాక్టర్ వి.శేఖర్‌ను బదిలీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా డీఈఓగా పనిచేస్తున్న కుమార్‌ను అన్నమయ్య జిల్లా మదనపల్లి ఉప విద్యాశాఖాధికారిగా, తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారిగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

మీ ప్రైవేటు ఆస్పత్రిలో ఇలాగే చేస్తారా?

● ఓపీలో వైద్యుల పనితీరుపై వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అసంతృప్తి
● రుయాస్పత్రిలో మెరుగైన సేవలకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్న కృష్ణబాబు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 'మీ ప్రైవేటు ఆస్పత్రిని ఇలాగే నిర్వహిస్తారా? ఇలా డ్యూటీలకు రాని వారికి జీతాలు ఇస్తారా?' అంటూ ఓపీ కేంద్రం వద్ద వైద్యాధికారులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సూటిగా ప్రశ్నించారు. వెంటనే పనితీరు మార్చుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి గురువారం ఆయన రుయాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత అత్యవసర విభాగాన్ని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వైద్య పరికరాలను పరిశీలించారు. క్యాజువాలిటీ వార్డు చాలడంలేదని అక్కడి వైద్యులు చెప్పగా.. భవనం విషయంపై దృష్టి సారించాలని సూపరింటెండెంట్ రవి ప్రభును ఆదేశించారు. అక్కడ్నుంచి ఓపీ కేంద్రాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం ఓపీలో ఎనిమిది విభాగాల వైద్యులకుగాను ఒకే విభాగానికి చెందిన వారు ఉండటంపై ఆగ్రహించారు. రక్తపరీక్షా కేంద్రంలో ఎప్పుడో వచ్చిన రిపోర్టులు అక్కడే ఉండటంపై ప్రశ్నించారు. రోగులు వచ్చి తీసుకోవడం లేదని అధికారులు చెప్పగా.. సకాలంలో ఇస్తే ఎందుకు తీసుకోరని మండిపడ్డారు. రక్త పరీక్షల ఫలితాలను ఒక్కరోజులోనే అందించాలని, లేదంటే చర్యలు తప్పవన్నారు. ఇంకా రిపోర్టులు కాగితాలపై రాసివ్వడం ఏంటని అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం కృష్ణబాబు మీడియాతో మాట్లాడుతూ.. రుయాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సూపరింటెండెంట్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించామన్నారు. పీజీ సీట్లు పెంచుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఆస్పత్రిలో వైద్య విద్యార్థుల కోసం రూ.70 కోట్లతో నూతన భవనాలను నిర్మించామని, వైద్య పరికరాల కోసం మరో రూ.15 కోట్లు విడుదల చేశామన్నారు. భవిష్యత్తులో రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, డీఎంహెచ్‌వో శ్రీహరి, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు


రుయాలో ఏం జరిగింది?

● హెచ్‌డీఎస్ సభ్యుడి తీరుపై సీఎంవో ఆరా ● విచారణ చేపట్టిన పోలీసులు
● చైర్మన్‌గా చెలామణీ అయితే చర్యలు తప్పవంటూ కలెక్టర్ హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాస్పత్రిలో బుధవారం జరిగిన రెండు ఘటనలపై సీఎం కార్యాలయం స్పందించింది. వీటిపై గురువారం ఆరా తీసింది. పూర్వపు విద్యార్థులు ఏర్పాటు చేస్తున్న అప్పటి వైద్య విభాగాధిపతి డాక్టర్ ఇందిరా బాయ్ విగ్రహ కార్యక్రమ శిలాఫలకంలో వర్కింగ్ కమిటీ చైర్మన్ హోదాతో తన పేరు ఎందుకు నమోదు చేయలేదని వైద్యాధికారులపై సభ్యుడు బండ్ల లక్ష్మీపతి ఆగ్రహించడం.. ఆ శిలాఫలకాన్ని తొలగించడం తెలిసిందే. అదేరోజు తన కారుకు అడ్డు వచ్చారంటూ ఆటో డ్రైవరుతో దురుసుగా ప్రవర్తించి ఆక్సిజన్ మాస్కుతో ఉన్న రోగిని ఇబ్బందులకు గురి చేసిన విషయమూ విదితమే. ఈ రెండు ఘటనలపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాల నేపథ్యంలో విచారించి నివేదికలు పంపాలని సీఎంవో నుంచి జిల్లా అధికారులకు గురువారం ఆదేశాలు అందాయి. మరోవైపు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు విచారణ చేపట్టారు. వెస్ట్ సీఐ రామకృష్ణ రుయాస్పత్రికి చేరుకొని ఆక్సిజన్ మాస్కుతో ఆటోలో ఉన్న రోగిని ఇబ్బంది కలిగించేలా అవుట్ పోస్టు సిబ్బంది ఏమైనా వ్యవహరించారా అనే కోణంలో దర్యాప్తు చేశారు. చిన్నపిల్లల వార్డు ముందు తొలగించిన శిలాఫలకాన్ని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. చైర్మన్ హోదాతో.. ఆస్పత్రి ఆవరణలో హెచ్‌డీఎస్ సభ్యుడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే మీరెందుకు ఊరుకున్నారు.. మా దృష్టికి ఎందుకు తీసుకురాలేదని సూపరింటెండెంట్ రవిప్రభును కలెక్టరు వివరణ అడిగారు. వెంటనే ఆ ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. అతడికి ప్రత్యేక గది కేటాయించేందుకు కుదరదని, మరోసారి చైర్మన్ అని చెప్పుకొన్నా.. రోగులు ఇబ్బంది పడేలా వ్యవహరించినా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

హెచ్‌డీఎస్ చైర్మన్‌గా కొత్త శిలాఫలకం


బండ్ల లక్ష్మీపతిని హెచ్‌డీఎస్ చైర్మన్‌గా పేర్కొంటూ సిద్ధం చేసిన శిలాఫలకం

కాగా, డాక్టరు ఇందిరాబాయ్ విగ్రహ వద్ద శిలాఫలకంలో హెచ్‌డీఎస్ సభ్యుడు లక్ష్మీపతి పేరును హెచ్‌డీఎస్ చైర్మన్‌గా పేర్కొంటూ కొత్త శిలాఫలకాన్ని గురువారం సిద్ధం చేశారు. ఈ శిలాఫలకాన్ని ఏర్పాటు చేయరాదని చిన్నపిల్లల విభాగాధిపతి మనోహర్‌ను సూపరింటెండెంట్ ఆదేశించారు. దీంతో పాత శిలాఫలకాన్నే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. కాగా, శిలాఫలకంలో తన పేరు వేయాలని డిమాండు చేయలేదని, కలెక్టరు, ఎమ్మెల్యే పేర్లుంటే బాగుటుందని మాత్రమే చెప్పానని హెచ్‌డీఎస్ సభ్యుడు బండ్ల లక్ష్మీపతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



గూడలి వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

సాధారణంగా వరి నాట్లంటే స్థానికంగా ఉన్న మహిళా కూలీలు వేస్తుంటారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీరు రూ.500 వరకు కూలి తీసుకునేవారు. కానీ, ఏడాదిన్నరగా బెంగాల్ నుంచి మగ కూలీలొస్తున్నారు. కోట, వాకాడు, చిట్టమూరు ప్రాంతాలలో వీరు వరి నాట్లు వేస్తున్నారు. ఎకరా పొలంలో నాట్లు వేసేందుకు 4,300 రూపాయలు తీసుకుంటున్నారు. కాగా, వరినాట్లకు బెంగాల్ మగకూలీలకు డిమాండు పెరిగింది.

- కోట, ఆంధ్రజ్యోతి

'విజ్ఞానగిరి' వద్ద మద్యం దుకాణం వద్దు

శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున సుబ్రహ్మణ్యేశ్వర స్వామికొలువైన విజ్ఞానగిరి (కుమారస్వామి తిప్ప) ఆలయం వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ మహిళలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు గురువారం ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు, ఆస్పత్రితో పాటు ఆలయం, ముక్కంటి ఆలయ నారదపుష్కరణి ఉన్నట్లు వివరించారు. వైసీపీ పాలనలోనూ కుమార స్వామి తిప్ప వద్ద మద్యం దుకాణం ఏర్పాటుకు అధికారులు ప్రయత్నించగా తమ నిరసనతో ఆపేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుకు కొందరు ప్రయత్నిస్తున్నారని.. ఈ ప్రాంత ప్రాశస్త్యం రీత్యా అనుమతి ఇవ్వొద్దని కోరారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

గ్రంథాలయ విద్యలో 50 ఏళ్లు

- నేటి నుంచి ఎస్వీయూలో లైబ్రరీ సైన్స్ విభాగ స్వర్ణోత్సవాలు

విజ్ఞాన కేంద్రాలుగా గ్రంథాలయాలు సమాజంలో నిలిచాయి. ఎస్వీయూలో లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్ 1974లో ప్రారంభమైంది. తొలుత బీఎల్ఐఎస్సీ కోర్సు నిర్వహించింది. ప్రస్తుతం ఎంఎల్ఐఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తూ ఉంది. తొలి రోజుల్లో ఎస్.శ్రీపతి నాయుడు, ఎస్.గురుస్వామి నాయుడు, టి.రాజగోపాల్ తదితరులు ఆచార్యులుగా ఈ విభాగంలో సేవలు అందించారు. ప్రస్తుతం ఒక రెగ్యులర్ ఫ్యాకల్టీతో పాటు మిగతా అకడమిక్ కన్సల్టెంట్లు బోధన సాగిస్తూ ఉన్నారు. లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇప్పటి వరకు 89 పీహెచ్‌డీలు, 32 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. చిన్నారుల్లో పుస్తక అధ్యయనం పట్ల ఆసక్తిని పెంచడంపై ఒక పరిశోధనా ప్రాజెక్టు నిర్వహించారు. పీజీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏటా నాలుగు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణ పట్ల విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కలిగిస్తున్నారు. ఇలా బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో సేవలు అందించింది. గ్రంథాలయ విద్యలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దింది. పూర్వ విద్యార్థులు ప్రస్తుతం అనేక చోట్ల ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీ లైబ్రరీ సైన్స్ విభాగం స్వర్ణోత్సవాలు నిర్వహించుకోనుంది.



లైబ్రరీ సైన్స్ విభాగం



శ్రీపతి నాయుడు



గురుస్వామి నాయుడు

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు), (ఆంధ్రజ్యోతి)

ఘనమైన స్ఫూర్తిని కొనసాగిస్తాం



యాభై ఏళ్ల సుదీర్ఘ చరిత్రను ఒకసారి సమీక్షించుకుంటాం. గడిచిన చరిత్రను గుర్తు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో చేయవలసిన అభివృద్ధికి అవసరమైన స్ఫూర్తిని పొందుతాం. ఇలా లైబ్రరీ సైన్స్ విభాగాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తాం.

- ప్రొఫెసర్ ప్రశాంతికుమారి, హెడ్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్

నేడు స్వర్ణోత్సవ సంబరం : లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ స్వర్ణోత్సవ సంబరం శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, ద్రవిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ దొరస్వామి, వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ సుధారాణి, సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సురేంద్రబాబు, లైబ్రరీ సైన్స్ హెడ్ ప్రశాంతకుమారి పాల్గొంటారు. గోల్డెన్ జూబ్లీ సావనీర్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వైసీపీ గురివింద రాజకీయం



- ఎస్వీయూ స్టేడియంలో కార్తీక్ షోపై విమర్శలు
- అద్దెకు ఇవ్వడం ఏమిటంటూ రాద్ధాంతం
- మరి జగన్ పాలనలో చేసిందేమిటి?

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ తారకరామ స్టేడియాన్ని ప్రముఖ నేపథ్య గాయకుడు కార్తీక్ లైవ్ షోకు ఇవ్వడంపై వైసీపీ గురివింద రాజకీయం చేస్తోంది. స్టేడియాన్ని ప్రైవేట్ షోలకు ఇస్తూ విశ్వవిద్యాలయాన్ని అధికార పార్టీ భ్రష్టు పట్టిస్తోందని జగన్ పత్రికలో కథనాలు వేశారు. ఎస్వీయూ స్టేడియంలో ప్రైవేట్ కార్యక్రమాల నిర్వహణ కొత్తేమీ కాదన్న విషయం తెలిసీ అధికారులపై విమర్శలు గుప్పించారు. దీనివెనుక టీడీపీ ఉందంటూ ఆరోపించడంపై పలువిద్యార్థి సంఘాలు, వర్సిటీ వర్గాలు మండిపడుతున్నాయి. నిబంధనల మేరకు ఓ సంగీత కార్యక్రమానికి స్టేడియాన్ని అద్దెకు ఇస్తే అసత్యప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వర్సిటీ ప్రాంగణంలోనే అనేక రాజకీయ కార్యక్రమాలను నిర్వహించారని గుర్తుచేశారు.

ఎప్పటినుంచో అద్దెకు ఎస్వీయూ స్టేడియం

1954 నుంచీ యూనివర్సిటీకి స్టేడియం ఉంది. 1966లో ఆధునీకీకరించారు. సుమారు పది ఎకరాల విస్తీర్ణంతో 10 వేల మందికి పైగా సామర్థ్యంతో స్టేడియం ఉంది. వర్సిటీ అవసరాలకు ఉపయోగించుకుంటూనే, బయటి వ్యక్తులకు క్రీడా, సినిమా, సాంస్కృతిక, సంగీత ప్రదర్శనలకు కేటాయిస్తూ వస్తున్నారు. దీనికి అద్దె వసూలు చేస్తున్నారు. బయటి వ్యక్తులకు క్రీడా పోటీలకు రోజుకు రూ. 5 వేల చొప్పున ధరలు నిర్ణయించారు. గతంలో ఇది రూ.4 వేలు ఉండగా, ఇటీవల నిర్వహించిన స్పోర్ట్స్ బోర్డ్ మీటింగ్‌లో రూ. 5 వేలు చేశారు. నాన్ కమర్షియల్ కోసమైతే రోజుకు రూ. లక్ష, మరో రూ.25 వేలు నిర్వహణ కోసం కట్టించుకుంటారు. కమర్షియల్ అయితే రూ.3 లక్షల రుసుంతో పాటు నిర్వహణ కింద మరో రూ.50 వేలు ధర నిర్ణయించారు. ప్రస్తుతం లైవ్ షోకు రూ.3.5 లక్షలు నిర్వాహకులు చెల్లించారు. గతంలో బాహుబలి, ఆదిపురుష్ వంటి సినిమా ఫంక్షన్లనూ ఎస్వీయూ తారకరామ స్టేడియంలోనే నిర్వహించారు. దీనికి అనుమతులు, అద్దెనూ ఇదే తరహాలో చేశారు. అయితే, కార్తీక్ లైవ్ మ్యూజిక్ షో పట్ల కొందరు రాద్ధాంతం చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తమవుతోంది. యూనివర్సిటీల్లో అనేక ప్రభుత్వ, ప్రభుత్వేతర, క్రీడా, సినిమా, సాంస్కృతిక, మ్యూజిక్, బుక్ రిలీజ్ వంటి కార్యక్రమాలు నిరంతరంగా సాగుతున్నాయి.

ఎప్పటి నుంచో అద్దెకు ఇస్తున్నాం

తారకరామా స్టేడియాన్ని ఎప్పటి నుంచో అద్దెకు కేటాయిస్తున్నాం. ఇదంతా యూనివర్సిటీ నియమ నిబంధనల ప్రకారమే చేస్తున్నాం. ప్రస్తుతం కార్తీక్ లైవ్ మ్యూజిక్ షో నిర్వాహకులు అనుమతి కోరారు. ముందుగానే అద్దె చెల్లించారు. అందుకే అనుమతించాం.

- ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ డైరెక్టర్, ఎస్వీయూ

కార్తీక్‌షో వల్ల ఇబ్బందేమి?

నిబంధనల ప్రకారం రోజుకు రూ.3.5 లక్షలను నిర్వాహకులు ఇప్పటికే చెల్లించారు. స్టేడియాన్ని అధికారికంగానే కేటాయించినా ఇలాంటి విమర్శలు చేయడం దారుణమని యూనివర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. బయటి వ్యక్తులకు అద్దెకు స్టేడియంను కేటాయించిన నేపథ్యంలో నిర్వాహకులు వారి ఇష్ట ప్రకారం నిర్వహణను చేపట్టనున్నారు. ఈ వ్యవహారంతో యూనివర్సిటీ ఉన్నతాధికారులకు ఎలాంటి సంబంధం ఉండదు. అధికారులతో పాటు ఎలాంటి సంబంధం లేని వ్యక్తులనూ ఈ వ్యవహారంలోకి లాగుతుండటం గమనార్హం. ఇక, ఈ కార్యక్రమం ఎలాంటి అసభ్యకరమైన డ్యాన్సులతో కూడినది కాదు. వారాంతంలో.. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 నుంచి 10 గంటల వరకూ మ్యూజిక్ షో ఉంటుంది. దీనివల్ల పని వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులకు కూడా ఇబ్బంది తలెత్తే అవకాశం లేదు. అయినా కొందరు వివాదాస్పదం చేయడం గమనార్హం. యూనివర్సిటీ అధికారులను ఇబ్బందులకు గురి చేయాలనే ఆలోచనతో ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న వసుధమిశ్రా

పారిశ్రామిక భద్రతే ధ్యేయం

- రాష్ట్ర పరిశ్రమల ఉన్నత స్థాయి కమిషన్ చైర్‌పర్సన్ వసుధామిశ్రా

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పారిశ్రామిక భద్రతను మెరుగుపరచడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని రాష్ట్ర పరిశ్రమల ఉన్నత స్థాయి కమిషన్ చైర్‌పర్సన్ వసుధామిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లతో ఆమె సమావేశమయ్యారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించిందన్నారు. పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలు నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణం, అటవీ, సైన్స్ టెక్నాలజీ కార్యదర్శి అనంతరాము మాట్లాడుతూ పరిశ్రమల్లో మౌలిక సదుపాయాలు, మానవ వనరుల పరంగా సంస్థలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యదర్శి ఎంఎంనాయక్ పరిశ్రమల భద్రతపై పలు సూచనలు చేశారు. అంతకు ముందు జిల్లాలోని పలు పరిశ్రమలను సందర్శించి, ప్రతినిధులతో చర్చించారు.సమావేశంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్ కుమార్, ఆనంద్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి శరవణన్, ఇతర అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తిచేస్తాం : సీఈ



మల్లికార్జున్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కుప్పం బ్రాంచ్ కెనాల్, హంద్రీనీవా బ్రాంచ్ కెనాల్, తిరుపతికి తాగునీరు అందించేందుకు బాలాజీ రిజర్వాయర్, మల్లిమడుగు రిజర్వాయర్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎం.మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులతో పాటు హంద్రీనీవా పనులు పూర్తిచేసి ప్రజలకు నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి యాత్రాస్థలం కావడంతో తాగునీటి సమస్య తలెత్తకుండా బాలాజీ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తామన్నారు.

12 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను పోలీసులు అరెస్టుచేశారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. విశాఖ నుంచి తిరుపతికి గంజాయి రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు పట్టణ శివారులోని బైపాస్ వంతెన వద్ద పీఎస్ జాతీయ రహదారిపై రెక్కీ నిర్వహించారు. ఆ సమయంలో చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలం ఏఎంపురం అరుంధతివాడకు చెందిన పన్నూరు బాబు(63), ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఉదయగిరి గ్రామానికి చెందిన రాజన్‌కుమార్(41) గంజాయితో పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయితో పాటు రూ.4వేల నగదు సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రాజన్‌కుమార్



పన్నూరుబాబు

పాకాలలో మరో ఆరు కిలోలు..

పాకాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరు కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పాకాల సీఐ మద్దయ్య ఆచారి గురువారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పాకాల రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు గురువారం మాటువేశారు. బ్యాగుతో బయటకు వచ్చిన ఓ బ్యాగు.. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడులోని కడలూరు జిల్లా చొక్కానాథపాళ్యంకు చెందిన శరవణ శంకర్‌గా గుర్తించారు. లీనా అనే వ్యక్తి నుంచి రూ.15,000 తీసుకొని విశాఖ నుంచి చెన్నైకి గంజాయి రవాణా చేస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. ఇతడిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతున్నట్లు సీఐ తెలిపారు. ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఏఎస్ఐ వెంకటరత్నం నాయుడు, హెడ్‌కానిస్టేబుల్ సోమశేఖర్‌నాయుడు, చలపతి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారన్నారు.

డిజిటల్ వ్యాపారంలో మహిళలు రాణించాలి



కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ వ్యాపార రంగంలో మహిళలు రాణించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకాంక్షించారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు చేపట్టిన శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలని కోరారు. డిజిటల్ వ్యాపార రంగంలో మహిళలు తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగించాలన్నారు. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. పద్మావతి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ మహిళలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా మహిళా సాధికారతకు మహిళా యూనివర్సిటీ దోహదం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరిదేవి, ఏపీసీఐసీటీ డైరెక్టర్ కియాంగ్‌కో, కన్సల్టెంట్ ఉషావ్యాసులరెడ్డి, రిజిస్ట్రార్ రజని, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ ప్రొఫెసర్ దుర్గాభవాని, ప్రొఫెసర్ విజయలక్ష్మి, పలు ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన పారిశ్రామిక భద్రతా కమిటీ తనిఖీలు

శ్రీసిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో రాష్ట్ర పారిశ్రామిక భద్రతా ప్రమాణాల కమిటీ బృందం నిర్వహిస్తున్న తనిఖీలు గురువారం ముగిశాయి. రాష్ట్రంలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి వసుధ మిశ్రా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పారిశ్రామిక భద్రతా కమిటీ శ్రీసిటీలో మూడు రోజులుగా వివిధ పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టింది. ఈ పర్యటనలో కమిటీలోని ఉన్నతాధికారులు, భద్రతా నిపుణులు శ్రీసిటీలోని డైకిన్, కింబర్లీ క్లార్క్, అల్‌స్టోం తదితర పరిశ్రమలలో తనిఖీలు నిర్వహించారు.



డైకిన్ పరిశ్రమను సందర్శించిన కమిటీ బృందం

భారతీయ సంస్కృతికి ఆగమాలు ఆధారం

తిరుపతిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి ఆగమాలు ఆధారాలని తిరుమల విఖనసట్రస్ట్ కార్యదర్శి గంజాం ప్రభాకరాచార్యులు తెలిపారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో అర్చనం(వైఖానసం) అనే అంశంపై తొమ్మిది రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆగమశాస్త్రం భగవన్నిర్మితమని, ఆధ్యాత్మిక మార్గంలో మన జీవనయాత్ర సఫలం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ తట్టా విజయరామవాచార్యులు మాట్లాడుతూ ఆలయాలలో అర్చకుని పాత్ర కీలకమైందని, అర్థపంచకం శరణాగతి తత్వాలు అలవర్చుకుని అర్చన చేస్తే విశేష ఫలితాలు ఉంటాయని చెప్పారు. వేదాంతం డీన్, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు ఆలయంలో భారీగా బదిలీలు

తిరుచానూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఏళ్ల తరబడి తిష్ట వేసుకున్న కొంతమంది అధికారులు, సిబ్బందిని బదిలీ చేస్తూ గురువారం టీటీడీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ఏఈవో రమేష్‌ను హైదరాబాద్‌లోని టీటీడీ సమాచార కేంద్రానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో తిరుమల ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న దేవరాజులను నియమించారు. సూపరింటెండెంట్ శేషగిరిని హెచ్‌ఆర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలోఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్‌ను నియమించారు. అర్జితం ఇన్‌స్పెక్టర్ గణేష్‌ను డిప్యూటీ ఈవో కార్యాలయానికి, అక్కడ పనిచేస్తున్న మురళిని బదిలీ చేశారు. ప్రసాదాల ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను ఉగ్రాణానికి, అక్కడ పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ జయకుమార్‌ను హెచ్‌ఆర్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అర్జితం ఇన్‌స్పెక్టర్‌గా సుబ్బరాయులు, ప్రసాదాల ఇన్‌స్పెక్టర్‌గా చలపతిని నియమించారు.

రేపటి నుంచి ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాలబాలికలు 10వ తరగతి మార్కులిస్టు, స్టడీ, ఆధార్ జిరాక్సులు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. క్రీడా పోటీల తేదీలు, ఇతర వివరాలకు 26న బాలాజీ కాలనీలోని విశ్వేశ్వర యోగా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో యోగాసనం పోటీలు(9393621004), 27న మధ్యాహ్నం 3.30గంటల నుంచి శ్రీనివాస క్రీడా సముదాయంలో మహిళా క్రికెట్(9393621004), 27న ఉదయం 9.30నుంచి రేణిగుంట జిల్లా పరిషత్ పాఠశాలలో సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్(8712257060), 30న ఉదయం 9.15 గంటల నుంచి చిత్తూరులోని డీఎస్ఏ స్టేడియంలో ఖోఖో, రోప్ స్కిప్పింగ్, ఫెన్సింగ్(9440674457) సంప్రదించాలని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో పెన్షన్ అదాలత్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి జీపీఎఫ్ పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖజానా, లెక్కల అధికారి లక్ష్మీకరరెడ్డి తెలిపారు. పెన్షనర్లకు, జీపీఎఫ్‌కు సంబంధించిన సమస్యలు తెలిపితే అక్కడే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

5 టిప్పర్ల సీజ్

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, చంద్రశేఖరపురం, చిటేడు, కేశవరం గ్రామాల్లో తిరుగుతున్న వాహనాలపై గురువారం గనులశాఖలోని విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి పనులు చేస్తున్న సంస్థకు చెందిన 5 టిప్పర్లు మైనింగ్‌శాఖకు ఎలాంటి రాయితీలు చెల్లించకుండా, అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తుండటంతో విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకొని సీజ్‌చేసి కోట పోలీసులకు అప్పగించారు. మైనింగ్‌శాఖ గుంటూరు, ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు జిల్లాల జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్‌శాఖకు చెందిన రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, విజిలెన్స్ అధికారులు ఈ దాడులు చేశారు.









పేదలకు అండగా ఉంటాం


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాజేంద్ర, టీడీపీ నేతలు

కోట, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): నిరుపేదలకు అండగా ఉండి తమ వంతు సహకారాన్ని ఎల్లవేళలా అందజేస్తామని ప్రముఖ బిల్డర్ మర్రిబోయిన రాజేంద్ర హామీ ఇచ్చారు. మండల పరిధిలోని కేశవరం పంచాయతీలో గల రాఘవాపురంలో గురువారం 300 మంది నిరుపేద వృద్ధులకు రాజేంద్ర దాతృత్వంతో దుప్పట్లు పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులైన జయరామయ్య, జయమ్మల జ్ఞాపకార్థం రాఘవాపురం, కేశవరం, సిద్ధమ్మకండ్రిగ గ్రామాల్లోని నిరుపేదలకు రాజేంద్ర దుప్పట్లను అందజేశారు. గిరిజనుల కాలనీలలో మౌలిక వసతుల ఏర్పాటుకు తనవంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ అధికార ప్రతినిధి వరిదిగొల్ల కోటేశ్వరప్రసాద్, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, మస్తానయ్య, వెంకటరమణయ్య తదితరులు ఉన్నారు.

ఒకరి రక్తదానం.. మరెందరికో ప్రాణదానం


రక్తదాతలకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎస్పీ

నాయుడుపేట, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): ఒకరు రక్తదానం చేయడం ద్వారా మరెందరికో ప్రాణదానం కలుగుతుందని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో యువ నాయకులు పొట్లపూడి రాజేష్ ఆధ్వర్యంలో 25 మంది యువత రక్తదానం చేశారు. సామాజిక స్పృహ కలిగిన యువతను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ప్రాణ, ఆస్తి, పరిరక్షణలో ప్రాణాలు త్యాగం చేసిన పోలీసు అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, డాక్టర్ చంద్రకళ, అర్బన్ సీఐ బాబీ, రూరల్ సీఐ సంగమేశ్వరరావు, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, దొరవారిసత్రం ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేద్దాం

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి అందరం కలిసి కట్టుగా కృషిచేద్దామని డీసీసీ అధ్యక్షుడు బాలగురవంబాబు అన్నారు. గురువారం స్థానిక త్యాగరాజవీధిలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, వైఎస్ షర్మిల నాయకత్వంతో ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ పేదలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరిమల వెంకటేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, సతీష్, శ్రీనివాసులు, రాధయ్య, గౌస్ బాషా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టను ఆనుకుని అక్రమ నిర్మాణాలు

● అడ్డుకున్న గూడూరు మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోటుపాళెం జాతీయరహదారి సమీపంలోని చెరువుకట్ట సమీపంలో నిర్మిస్తున్న అక్రమకట్టడాలను అధికారులు అడ్డుకున్నారు. గురువారం కట్టడాలను ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. చెరువుకట్టను ఆనుకుని కొందరు గతంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో కొద్దిరోజులుగా భవన నిర్మాణాలు చేపట్టేందుకు కొందరు పనులు చేపట్టారు. చెరువుకట్టకు, గూడూరు వచ్చే ప్రధానరహదారికి సమీపంలో కట్టడాలను నిర్మించేందుకు భారీ గోతులు తీశారు. దీంతో చెరువు కట్టలు బలహీన పడుతాయని, భవిష్యత్తులో ప్రధాన రహదారి విస్తరణ చేపట్టాలన్నా ఇబ్బందులు తప్పవని పలువురు రైతులు ఇరిగేషన్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిర్మాణం కోసం తీసిన భారీ గోతుల్లో చెరువు నుంచి ఊట వస్తుండడంతో నిర్మాణాలు చేపడితే మున్ముందు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని, చెరువు బఫర్‌జోన్ కింద నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు. దీంతో ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు కట్టడాల కోసం తవ్విన భారీ గోతులను యుద్ధప్రాతిపదికన యంత్రాల సాయంతో పూడ్చివేయించారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ ఏఈ సురేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు

గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ

● ఎమ్మెల్యే సునీల్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వాకాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే రాష్ట్రవ్యాప్తంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని వాకాడు, ముట్టెంబాక, దుగరాజపట్నం పంచాయతీలలో గురువారం సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిపై గౌరవంతోనే వాకాడు టెంకాయలతోపు ప్రాంతానికి ఆయన పేరు పెట్టామన్నారు. వెలుగు సీసీలు, వీవోఏల పనితీరు మార్చుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేని భారీ గజమాలతో సత్కరించారు. నేతల దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, లక్ష్మి ప్రసాద్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కృష్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి, ప్రమీల, చంద్రయ్య, తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావు తదితరులు పాల్గొన్నారు.

పూడ్చి పెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం

చిట్టమూరు, అక్టోబర్ 24(ఆంధజ్యోతి): చిట్టమూరు మండలం కోగిలిలో అనుమానాస్పదంగా మృతి చెందిన తుపాకుల చెంచుకృష్ణయ్య మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కోగిలి రొయ్యల గుంటల వద్ద కాపలాగా ఉన్న చెంచుకృష్ణయ్య అనే గిరిజనుడు ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. భార్యతో గొడవ పడి గుళికలు తిని చనిపోయాడని బంధువులు చెప్పడంతో భార్య, బంధువులు కలసి గూడూరు స్వస్థలం కావడంతో మృతదేహాన్ని గూడూరుకు తరలించి, దహన సంస్కారాలు చేశారు. అయితే చెంచుకృష్ణయ్యను రొయ్యల గుంటల యజమాని వేధించడం వలనే ఆత్మహత్య చేసుకొని చనిపోయాడని, కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించాలని యానాదుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దాంతో పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్ సమక్షంలో శవ పంచనామా నిర్వహించినట్లు ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు.


గూడూరులో పూడ్చిపెట్టిన చెంచుకృష్ణయ్య మృతదేహాన్ని బయటకు తీసిన దృశ్యం

బందోబస్తు నడుమ అంత్యక్రియలు

పెళ్లకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన బండి చెంచయ్య(49) అలియాస్ పోతురాజు చెంచయ్య మృతదేహానికి గురువారం మధ్యాహ్నం భారీ పోలీసు బందోబస్తు నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. గురువారం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు చిల్లకూరు వడ్డిపాలెం తరలించారు. గ్రామంలో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా దొరవారిసత్రం ఎస్‌ఐ అజయ్‌కుమార్‌తో పాటు పోలీసులు గ్రామం చుట్టూ భారీ ఎత్తున మోహరించారు.

రైతులకు పారదర్శకంగా పరిహారం అందించాలి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సాగరమాల జాతీయ రహదారికి భూమి కోల్పోయిన రైతులకు పారదర్శకంగా పరిహారం అందేలా చూడాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అన్నారు. నాయుడుపేట మండలంలో సాగరమాలకు దాదాపు 95 ఎకరాలు భూసేకరణ చేశారు. ఈ క్రమంలో అన్నమేడు ప్రాంతంలో సాగరమాల భూములను ఆమె గురువారం పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దారు గీతావాణి, డీటీ రాజేంద్ర, సర్వేయర్ తదితరులు ఉన్నారు.

అద్దెలు భరించలేం

- దుకాణదారుల నిరసన

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో పంచాయతీ దుకాణాలకు సంబంధించి అధికంగా విధించిన అద్దెలు చెల్లించలేమంటూ గురువారం దుకాణదారులు ఆందోళన, నిరసన తెలియజేశారు. కోటలోని 25 పంచాయతీ దుకాణాలను అద్దెకు తీసుకున్న యజమానులు అద్దెల భారం మోయలేమని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్కొక్క దుకాణానికి రూ.18,300 అద్దెలు విధిస్తే ఎలా చెల్లిస్తామన్నారు. పంచాయతీ అధికారులు, పాలకమండలి స్పందించి అద్దెలు తగ్గించాలని కోరారు.

బీరు బాటిల్‌తో దాడి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24: నాయుడుపేట-మల్లాం జంక్షన్ కూడలి వద్ద ఈ నెల 22వ తేదీ రాత్రి మల్లాం జంక్షన్ కూడలి వద్ద గురవయ్య అనే వ్యక్తి పాత కక్షల కారణంగా గురునాథంపై బీరు బాటిల్‌తో దాడిచేసి గాయపరిచినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురవయ్యపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

ట్రైసైకిల్ పంపిణీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ కార్యాలయంలో ఓజిలి మండలం మనవాలి గ్రామానికి చెందిన దివ్యాంగుడు సోమయ్యకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ట్రైసైకిల్‌ను పంపిణీ చేశారు.

గంగాప్రసాద్‌ను విమర్శిస్తే సహించం

● మాజీ ఎంపీ నెలవల

నాయుడుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, అజాత శత్రువు అయిన కొండేపాటి గంగాప్రసాద్‌ను విమర్శించినా, శవరాజకీయాలు చేసినా ఎట్టి పరిస్థితుల్లో సహించమని మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తీవ్రంగా హెచ్చరించారు. ఎటువంటి వివాదాలు లేని గంగాప్రసాద్‌ను ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి విమర్శించడం అర్థరహితమని, ఆయనస్థాయికి తగినది కాదని అన్నారు. పెళ్లకూరు మండలం చిల్లకూరులో చెంచయ్య మృతి చెందితే ఎటువంటి ఆధారాలు లేకుండా టీడీపీకి ఆపాదించడం వంటి శవరాజకీయాలు మానుకోవాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీరెడ్డి, రమేష్ నాయుడులు సత్యనారాయణరెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. టీడీపీ మండల కార్యదర్శి నాగేంద్రరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణయ్య, విజయమోహన్ నాయుడు, నాయకులు సుబ్బారావు, నారాయణ, చెంగయ్య పాల్గొన్నారు.

గంగాప్రసాద్‌ను విమర్శించడం హేయమైన చర్య

గంగాప్రసాద్‌ను విమర్శించే స్థాయి నీకు లేదని డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డిని తిరుపతి జిల్లా టీడీపీ కార్యదర్శి గణపర్తి శోభన్‌నాయుడు హెచ్చరించారు. ఎంతోమందికి ఉపాధి కల్పించిన ఆయనను విమర్శించడం హేయమైన చర్య అని అన్నారు.

గంగాప్రసాద్‌ను విమర్శించడం తగదు: ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండేపాటి గంగాప్రసాద్‌ను విమర్శించే అర్హత డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డికి లేదని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం ఆమె గంగాప్రసాద్ ఇంటి వద్ద మీడియాతో మాట్లాడుతూ వైసీపీ కార్యకర్త అనుమానాస్పదస్థితిలో చనిపోతే దానిని టీడీపీకి రుద్దడం సరికాదన్నారు. కొండేపాటిపై చేసిన విమర్శలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, నాయకులు నెలవల రాజేష్, ఆకుతోట రమేష్, కె.శంకరయ్య, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తపాల ఉద్యోగులపై వేధింపులను ఆపాలి

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ తపాల ఉద్యోగులపై లక్ష్యాల పేరుతో చేస్తున్న వేధింపులను ఆపాలని ఎన్‌ఎఫ్‌పీఈ యూనియన్ నాయకుడు రాజు అన్నారు. గురువారం స్థానిక పోస్టాఫీసులో ఎన్‌ఎఫ్‌పీఈ ఆధ్వర్యంలో తపాల ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్యాల వేధింపులను నియంత్రించకపోతే నవంబరు 12, 13 తేదీలలో ఢిల్లీలోని డాక్ భవన్ ఎదుట రిలేనిరాహార దీక్షలు చేపడుతామని వెల్లడించారు. కార్యక్రమంలో సుధాకర్‌రాజు, నజీముద్దీన్, ఫైరోజ్, చంద్రశేఖర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వర్షానికి దెబ్బతిన్న ఎల్టిపైర్ల రైతులకు సూళ్లూరుపేట రైతు సేవా సహకార సంఘంలో సబ్సిడీపై విత్తనాలను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం పంపిణీ చేశారు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి కొరిడి, పేర్నాడు, దామరాయి పంచాయతీల్లో సుమారు 150 ఎకరాలకు పైగా ఎల్టిపైర్లు నీటిలో కుళ్లిపోయి రైతులకు నష్టం జరిగింది. దీంతో వ్యవసాయాధికారులు నష్టాన్ని అంచనా వేసి పంపించడంతో, నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో రూ.1215 విలువ గల 30 కిలోల బస్తాను రూ.243కే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.సుధాకర్ రెడ్డి, ఏ.రమేష్, ఏజీ.కిషోర్, తిరుపాల్, కె.శంకరయ్య, ఏడీఏ అనిత, ఏవో కవిత తదితరులు పాల్గొన్నారు. వైసీపీ అధికారంలో లేకపోయినా ఇంకా ఆ పార్టీ నాయకుల కనుసన్నలలోనే ఏవో కవిత పనిచేస్తున్నారని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో మొరపెట్టుకొన్నారు. వెంటనే ఎమ్మెల్యే కలుగజేసుకొని ఇకనైనా ప్రజల కోసం పనిచేయాలని ఏవోకు హితవు పలికారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వాకాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్టెంబాక ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టి.శ్రీనివాసరావు ఇటీవల మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆ పాఠశాలలో ఉపాధ్యాయుల నడుమ ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసరావు ఎంతో కష్టపడితేనే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిందన్నారు. శ్రీనివాసరావును సన్మానించిన వారిలో ఉచ్చూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఉచ్చూరు మల్లికార్జున్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, కుంచం దయాకర్, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తాం

దక్కిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రా మీనా అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఆల్తూరుపాడు, దేవునివెల్లంపల్లి, వెంబులూరు, మాధవాయపాళెం గ్రామాల్లో రైల్వే లైన్ నిర్మాణం జరిగే భూములకు నష్టపరిహారం అందించేందుకు గాను గ్రామ సభలు నిర్వహించారు. రైతులకు చెందిన 105 ఎకరాల భూములకు సంబంధించిన రికార్డులను స్థానిక రెవిన్యూశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. దక్కిలి తహసిల్దార్ శ్రీనివాసులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెంచయ్య మృతికి టీడీపీ వారే కారణం

● మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్త బల్లి చెంచయ్య మృతికి టీడీపీ వారే కారణమని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. నాయుడుపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెళ్లకూరు మండలం చిల్లకూరుకు చెందిన వైసీపీ కార్యకర్త చెంచయ్య బుధవారం మృతి చెందినా, గురువారం మధ్యాహ్నం వరకు పోస్టుమార్టం చేయకపోవడంపై పలు అనుమానాలను వ్యక్తం చేశారు. పోలీసులు ఎటువంటి వివక్ష లేకుండా కేసు దర్యాప్తు చేయాలని అన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ చెంచయ్య మృతి చెందిన విషయం జగన్మోహన్ రెడ్డికి తెలియజేశామని, పార్టీ నుంచి రూ.లక్ష అందజేయనున్నట్లు చెప్పారు. వైసీపీ నాయకులు చదలవాడ కుమార్, సిద్ధయ్య పాల్గొన్నారు.

ప్రతిపక్షంలోనూ వైసీపీ విఫలం

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి స్పష్టం

సూళ్లూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో కోల్పోయాక ప్రతిపక్షంలోనూ పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వంపై పోరాడే శక్తి కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈద సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఆర్‌అండ్‌బి బంగ్లాలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్‌కు ప్రజా సమస్యలు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై మాట్లాడే ధైర్యం లేదని, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ప్రధాన ప్రతిపక్షం పాత్ర పోషిస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు, నాయకులు వెంకటయ్య, బి.రాజారెడ్డి, రవి, చిన్నయ్య పాల్గొన్నారు.

సీసీల సస్పెన్షన్‌ను రద్దుచేయాలి

గూడూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దక్కిలి మండలం వెలుగు కార్యాలయంలో పనిచేసే సీసీల సస్పెన్షన్‌ను రద్దుచేయాలని షెడ్యూల కులాల సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య అన్నారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ షెడ్యూలకులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.